https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 29 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం,అక్టోబర్,28, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై పిటిషన్లు..

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

- తదుపరి విచారణ నవంబర్ 17కు వాయిదా- ఈసీ అఫిడవిట్‌పై స్పందనకు పిటిషనర్లకు రెండు వారాల గడువు- ఫారం-6లో మార్పులపై విచారణలో వాదనలు- ‘సర్’ నిర్ణయాలు ఏకగ్రీవమని ఈసీ వివరణ- ఓటర్ల జాబితా నిర్వహణపై పిటిషన్లలో అభ్యంతరాలు



న్యూఢిల్లీ,అక్టోబర్,27:సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈపిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌పై తమ స్పందన తెలియజేసేందుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు ఇచ్చింది. విచారణ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దోలా సేన్ తరఫున సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరుపై ఆమె అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఫారం-6లో మార్పులకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చినట్లు ఈసీ పత్రికా ప్రకటనలో పేర్కొందని ఆమె ఆరోపించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. కరువుపై తెలంగాణ సర్కార్ కీలక భేటీ

ఎల్‌నినో, వర్షపాతం లోటుపై చర్చ

- భట్టి విక్రమార్క అధ్యక్షతన నేడు అఖిలపక్ష భేటీ

- తాగునీరు, సాగునీటి సరఫరాపై ప్రధానంగా చర్చ

- కరువు నివారణకు పార్టీల సూచనలు స్వీకరించనున్న ప్రభుత్వం



హైదరాబాద్,అక్టోబర్,27:రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు , తీవ్రమవుతున్న కరువు పరిస్థితులపై చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించేందుకు బుధవారం నాడు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో (6వ అంతస్తు, గది నంబర్ 33) ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల అన్నదాతలు, సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించే దిశగా ఈ భేటీలో కూలంకషంగా చర్చించనున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగించడం, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటి రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా, అలాగే వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు. కరువు నివారణకు అనుసరించాల్సిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యూహాలపై వివిధ రాజకీయ పార్టీల నేతల నుంచి విలువైన సలహాలు, సూచనలను ప్రభుత్వం స్వీకరించనుంది. రాష్ట్రంలో తలెత్తిన ఈ కరువు పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ప్రభుత్వం ఈ సమావేశం ద్వారా విజ్ఞప్తి చేయనుంది. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ అఖిలపక్ష భేటీ దిశనిర్దేశం చేయనుంది.

స్థానిక ఎన్నికలపై పవన్ కీలక వ్యాఖ్యలు..


రెబల్స్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ



అమరావతి,అక్టోబర్,27:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పొత్తులో భాగంగా పార్టీ అధికారికంగా బీఫామ్ జారీ చేసినవారే కూటమి అభ్యర్థులని, నామినేషన్లు వేసిన ఇతరులు వాటిని ఉపసంహరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియ ఒక సవాల్ లాంటిదని, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో దీనిని విజయవంతంగా పూర్తి చేశామని పవన్ తెలిపారు. అందరం కలిసి కూర్చుని చర్చించి అభ్యర్థుల జాబితాను ఖరారు చేశామన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రదర్శించిన ఐక్యతను మరోసారి స్థానిక ఎన్నికల్లోనూ చూపాలని నేతలకు పిలుపునిచ్చారు. సీట్ల సర్దుబాటు చర్చల సమయంలోనే ఆర్నబ్ తుపాన్ వచ్చిందని, అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ సీఎం చంద్రబాబు తుపాన్‌పై సమీక్షలు నిర్వహించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని పవన్ గుర్తుచేశారు. సంక్షోభ సమయంలో ఆయన పనితీరు అందరికీ ఆదర్శమన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం ఛాలెంజింగ్‌గా పనిచేస్తోందని, దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని చెప్పారు. అడవితల్లి బాట కింద రూ.3,458 కోట్లతో 3,638 కిలోమీటర్ల రోడ్లు నిర్మించామని, పంచాయతీరాజ్ శాఖలో రూ.1.5 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

డిజిటల్ డేటా యాక్ట్‌పై ‘సుప్రీం’ విచారణ..

కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ



న్యూఢిల్లీ,అక్టోబర్,27:డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టంలోని నిబంధనలు పత్రికా స్వేచ్ఛను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, ఈ చట్టం ఇలాగే కొనసాగితే దేశంలో న్యూస్ రూమ్స్ మూతపడే పరిస్థితి వస్తుందని ప్రముఖ మీడియా సంస్థల డిజిటల్ విభాగాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇందులో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది హిందూ, ఇండియా టుడే, టైమ్స్ గ్రూప్, జీ, ఎన్డీటీవీ, నెట్‌వర్క్ 18 వంటి 21 ప్రముఖ వార్తా సంస్థల డిజిటల్ విభాగాలు సభ్యులుగా ఉన్న ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. డీపీడీపీ చట్టంలోని సెక్షన్లు వివిధ సెక్షన్లతో పాటు డీపీడీపీ రూల్స్, 2025లోని పలు నిబంధనలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయయూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే, పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వొకేట్ మాధవి దివాన్ తన వాదనలు వినిపిస్తూ.. డీపీడీపీ చట్టంలో జర్నలిజం కార్యకలాపాలకు ఎలాంటి ప్రత్యేక మినహాయింపు ఇవ్వలేదని తెలిపారు. వార్తలు అంటేనే ఎప్పటికప్పుడు కొత్తగా ఉండే సమాచారమని అన్నారు. ప్రతి రిపోర్టును పబ్లిష్, టెలికాస్ట్ చేయడానికి ముందు ప్రతిసారీ వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి, సమ్మతి కోరాల్సి వస్తే అసలు ఆ వార్తలు విశ్వసనీయతను కోల్పోతాయని, అది ముందస్తు సెన్సార్‌షిప్‌కే దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ కొత్త నిబంధనలతో దేశంలోని ప్రముఖ న్యూస్ రూమ్స్ మూతపడే ప్రమాదంద ఉందని పిటిషనర్ తరఫు లాయర్ ధర్మాసనానికి విన్నవించారు.

తెలంగాణలో కరువు తీవ్రత.. 365 మండలాలు

కరువు ప్రాంతాలుగా ప్రకటన!



హైదరాబాద్, అక్టోబర్ 27: తెలంగాణ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల పరిధిలోని 365 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించింది. ఇందులో 111 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలు ఉండగా, మరో 254 మండలాలు మధ్యస్థ కరువు మండలాలుగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే జూన్ 1నుంచి సెప్టెంబర్ 30 వరకు కురవాల్సిన వర్షపాతంలో భారీగా కోత పడింది. సాధారణంగా రాష్ట్రంలో 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే పడింది. అంటే సుమారు 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావం, బలహీనపడిన అల్పపీడన వ్యవస్థల కారణంగా దీర్ఘకాలిక వర్షాభావం ఏర్పడి పంటలను దెబ్బతీసింది. ఫలితంగా వరి సాగు విస్తీర్ణం భారీగా తగ్గి, 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పరిమితమైంది. ఈ కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. కరువు ప్రభావిత మండలాల్లోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించడంతో పాటు, వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, తాగునీరు, పశుగ్రాసం కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, ఉపాధి హామీ పథకం కింద అదనంగామరో 50 రోజుల పని కల్పించాలని ప్రతిపాదించారు.

కేంద్ర సహాయం కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (చిణ=ళీ) నిధులకై మెమోరాండం సమర్పించనున్నట్లు రేవంత్ సర్కార్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో కరువు తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపాలని కోరింది. ఈ కరువుకు సంబంధించి విడుదలైన ఉత్తర్వ్యాలు రాబోయే ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయని, దీనికి సంబంధించిన జాబితాను జిల్లా గెజిట్లలో ప్రచురించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.


గార్డును కొట్టి జైలు నుంచి 17 మంది ఖైదీల పరార్..

తమిళనాడులో ఘటన



చెన్నై,అక్టోబర్,27:సెక్యూరిటీ గార్డును కొట్టి 17 మంది ఖైదీలు జైలు నుంచి సినీ ఫక్కీలో పరారయ్యారు. తమిళనాడులోని తేని జిల్లా అండిపట్టి సమీపంలోని తెక్కంపట్టి సబ్ జైలులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైదీలు తమకు గాయాలైనట్లు నటించారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు వారి వద్దకు వెళ్లగా.. ఖైదీలు ఆ గార్డును కొట్టి పరారయ్యారు. ఖైదీలను లింగం, రాజా సింగధర్, కరప్పుసామి, సిలంబరసన్, తిరుపతి, మెంజిసుందరం, శబరి, పోన్ ముత్తు, నిజంత్, కార్తీక్ రాజా, ముగిలన్, సెల్వ, తరుణ్, రాజ్ కుమార్, ప్రవీణ్, ముత్తు ఇళంగో, రాజువిన్‌గా గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. అలాగే, ఈ ఘటనపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన ఖైదీల్లో నలుగురిని ఇప్పటికే పట్టుకుని కస్టడీలోకి తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని చెక్‌పాయింట్లు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. తేనికి పొరుగున ఉన్న జిల్లాల్లో నిఘాను పెంచారు. విలుప్పురం జిల్లాలో తీవ్రంగా నిఘా పెట్టారు. ఖైదీల్లో చాలా మంది విలుప్పురం జిల్లాకు చెందిన వారిగా భావిస్తున్నారు. ఖైదీలు ఎలా తప్పించుకున్నారన్న దానిపై దర్యాప్తు ప్రారంభించామని దిండిగుల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్.జయకుమార్ తెలిపారు. భద్రతా లోపం ఏమైనా ఉందా అని అనుమానిస్తున్నామని, దానిపైనా దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఖైదీల పరారీకి బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మంజీరా నదిలో దూకి ముగ్గురి గల్లంతు



మెదక్‌జిల్లా,అక్టోబరు 27: మెదక్ జిల్లా ఏడుపాయల బ్రిడ్జి వద్ద మంజీరా నదిలో దూకి తల్లి, ఇద్దరు కుమార్తెలు గల్లంతయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన సరిత (25), తన కుమార్తెలు వైష్ణవి (5వ తరగతి), శ్రావణిక (4వ తరగతి) మంజీరా నదిలో దూకారు. హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా సరిత పనిచేస్తున్నారు. ఆధార్ కార్డు సవరణ కోసం మెదక్‌కు వచ్చినదిలో దూకినట్లు సమాచారం. మంజీరా నదిలో దూకుతున్నట్లు సరిత తన బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఏడుపాయల వద్ద నది ఒడ్డున ముగ్గురి చెప్పులు, ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజఈతగాళ్లతో రెండు గంటల పాటు గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో అధికారులు తాత్కాలికంగా గాలింపు చర్యలను నిలిపివేశారు. ఉదయం నుంచి మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ శబ్దాలు



హైదరాబాద్: రాజేంద్రనగర్‌లో పలు ప్రాంతాల్లో భారీ శబ్దాలు కలకలం రేపాయి. ఎర్రబోర, ఉప్పరపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్‌లో పేలుడు శబ్దాలు వినిపించాయి. 10 సెకన్ల పాటు భూమి కంపించింది.

నాలుగు ప్రాంతాల్లో ఒక్కసారిగా పేలుడు శబ్దాలు రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. భూకంపమా..? ఇతర పేలుడు పదార్థాల కారణంగా వచ్చిన శబ్దమా? అంటూ స్థానికుల్లో చర్చ జరుగుతోంది. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో గాజుల రామారంలోని మెట్‌కానిగూడ పరిసర ప్రాంతాలలో భూమి కంపించిన సంగతి తెలిసిందే. మెట్‌కానిగూడ, హెచ్ఏఎల్, ఓక్షిత్ ఎన్‌క్లేవ్, ఆదర్శనగర్ కాలనీలలో ఒక్కసారిగా భారీ శబ్దంతో భూమి కంపించింది. భూమి కంపించడంతో స్థానిక పాఠశాలలకు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి.

మాధవ నగర్ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తారా

పదవుల నుంచి తప్పుకుంటారా

ఎంపీ అరవింద్ కాంగ్రెస్ నాయకులపై ఫైర్





భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద చేపట్టిన మహా ధర్నాలో పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఓ ఆర్ బి పనులకు వెంటనే నిధులు కేటాయించి పనులు చేస్తారా లేకుంటే పదవి నుంచి తప్పుకుంటారా అని కాంగ్రెస్ నాయకులకు ఘాటుగా విమర్శించారు. ఓ ఆర్ బి పనులకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు విడుదల చేసి పనులు చేపట్టిందని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా స్థానిక ఎమ్మెల్యేలు పిసిసి అధ్యక్షుడు రాజకీయం చేస్తున్నారని దిగబట్టారు. బోధన్ పట్టణంలో కూడా మూడు బ్రిడ్జిలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయగా డీపీఆర్లు పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జాతకం చేస్తూ ప్రజల పాలిట నరకాసురుల్లా తయారయ్యారని విమర్శించారు.దేశంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేలకోట్లు రైల్వే బ్రిడ్జిలకు రహదారులకు కేటాయించి పనులు పూర్తి చేస్తుండగా ఒక్క తెలంగాణలోనే ఈ పరిస్థితి దాపురిం చిందని అన్నారు. నిజామాబాద్ మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో సోమవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బిజెపి శ్రేణులు నగర ప్రజలు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యార్థుల సామాన్య ల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందని మాదవ నగర్ బ్రిడ్జి ఆర్ ఓ బి పనులు పూర్తి చేయటలో స్థానిక పిసిసి ప్రెసిడెంట్ మహేష్కుమార్ గౌడ్ ,బోధన్ ఎమ్మెల్యే అధికార ప్రతినిధి సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విఫలమయ్యారని వీరి సొంత పనులు పైరవీలకే పరిమి తమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో ఈ నాయకులు ఉండి ,ఏళ్ల తరబడి పనిలో జాప్యం చేయడంలో సిగ్గు చేటని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ కు ముఖ్యమంత్ర లేదా రాష్ట్రాని కా అని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కొడంగల్ కు వేలకోట్లు తరలిస్తున్న సీఎం ఈ జిల్లాలో వారధి పనులు పూర్తి చేయడానికి కేవలం 14 కోట్లు విడుదల చేయక పోవడం సిగ్గుచేటని అన్నారు. నిజాంబాద్ ప్రజల చిరకాల వాంఛ అయిన మాధవ్ నగర్ బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వెంటనే పనులు పూర్తిచేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని నిజామాబాద్ నగర ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి లుడిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి నగర కార్పొరేటర్లు మహిళా కార్పొరేటర్లు వివిధ కేడర్లలోని నాయకు లు , బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్, ఉపాధ్యక్షులు రాజ్ గణేష్, విపుల్, ప్రధాన కార్యదర్శి అర్జున్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనిత తదితరులు పాల్గొ న్నారు.ప్రజల ఇబ్బం దులు గాలికి వదిలేసి స్వంత పనులకే కాంగ్రెస్ నాయకులు పరిమితం అయ్యారని అన్నారు.10 సంవత్స రాలు అయిన పనులు పూర్తి చేయకపోవడం సిగ్గు సిగ్గు అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు విడుదల చేసిన, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేయడంలో జాప్యం సిగ్గు చేటని అన్నారు.విద్యార్థులు,యువకులు అంటే లెక్కలేదా అని ప్రశ్నించారు.ధర్నాలో ఎస్ఆర్ కాలేజీ , నారాయణ కాలేజీ , తిరుమల కాలేజీ తదితర కాలేజీల విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెంటనే మంజూరు చేసి వేసవి లోగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.నిధుల కోసం ఎంపీ ఎమ్మెల్యేలు నాయకులు భిక్షాటన చేశారు.

భీమినిలో ఉచిత కంటి మరియు వైద్య శిబిరం...

శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహణ....





బెల్లంపల్లి (డికే చాటింపు) భీమిని మండల కేంద్రంలో శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలు మరియు వైద్య శిబిరం నిర్వహించారు.మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కంటి పరీక్షల శిబిరంలో కిమ్స్ హాస్పిటల్, కాగజ్ నగర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కాగజ్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, టెక్నీషన్స్ దత్తా గౌడ్,గౌస్, భాను ప్రకాష్ లు పాల్గొని పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ శిబిరం నిర్వహిస్తున్న నిర్వాహకులు పోతురాజుల లక్ష్మన్ ను అభినందించారు. పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనియ మని అన్నారు ,ఈ శిబిరంలో 127 మంది పరీక్షలు నిర్వహించగా అందులో 27 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరం ఉన్నదని నిర్ధారించడం జరిగినదని, 27 మందికి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించడం జరుగుతుందని శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ కట్కూరి సత్యనారాయణ, కజ్జం రమేష్, భీమిని మండల బారాసా అధ్యక్షులు నిరంజన్ గుప్తా, భీమిని సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, బారాస నాయకులు పోతురాజుల రాజయ్య, బలగం సంతోష్, సుదర్శన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మహేష్ గౌడ్, రమేష్, భానేష్, ప్రదీప్, లక్ష్మీ నారాయణ, యాదగిరి, దినేష్, ప్రవీణ్, తానేష్, అక్షయ్, యువ నాయకులు చరణ్, మహేష్ గౌడ్, కుసుమ సతీష్, ఆకుల రాజేశం, రాకేష్ తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

మెండోరా గ్రామాలలో 54

సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 27 (డీకే చాటింపు):ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానం సైబర్ నేరాల నియంత్ర ణ మరియు డ్రగ్స్ నియంత్రణ లో ప్రజలు అప్రమంతముగా ఉండాలనిమంగళ వారం ఉదయం మెండోరా పోలీస్ స్టేషన్ లో 54: సీసీ కెమెరాల ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రారంభించడం జరిగింది.ఈ సంద ర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , , సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియో గంతో పోలీసింగ్ ను మరింత సమర్థ వంతంగా నిర్వహించ వచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.
అలాగే ట్రాఫిక్ నియం త్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసు లకు సహాయపడ తాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతా ల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరిం చాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యత గా తీసుకోవాలి.
దుకాణా ల యజమానులు తప్పనిసరిగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జక్రాన్ పల్లి గ్రామంలో 54 సి.సి కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీ ను పోలీస్ కమీషనర్ అభినం దించారు. మెండోరా గ్రామశీలో డ్రగ్స్ నివారణ , సైబర్ నేరాల పట్ల అవగాహన , రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ రూరల్ సి.ఐ జాన్రెడ్డి , మెండోరా ఎస్.ఐ సుహాసిని , మెండోరా గ్రామ వీడిసి చైర్మన్ మోహన్ రెడ్డి , ప్రభాకర్ , మరియు సర్పంచ్ ప్రమోద్ , మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ డేట్స్ -పొడిగించాలి

-పిడిఎస్యు డిమాండ్... -నారాయణపేట డిగ్రీ కళాశాల ముందు పిడిఎస్యు ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన...



నారాయణపేట,(డీకే చాటింపు): డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ డేట్ ను డిసెంబర్ నెలకు పొడిగించాలని కోరుతూ మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోఊ శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న అన్ని డిగ్రీ కళాశాలలకు సెమిస్టర్ ఎగ్జామ్ డేట్ విడుదల చేసినట్లు తెలిపారు.ఈ తేదీలపై ఆయా కాలేజీల విద్యార్థులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఇంతకుముందు సెమిస్టర్ ఎగ్జామ్స్ డిసెంబర్ నెలలో పెట్టేవారని,ఇప్పుడు మాత్రం నవంబర్ నెలలో ఎందుకు పెడుతున్నారని వారు ప్రశ్నించారు.కనీసం విద్యార్థులు చదువుకోవడానికి సమయాన్ని కూడా ఇవ్వకుండా ఎగ్జామ్స్ నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు.ఇంకా ఇప్పటికి డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజ్ విద్యార్థులు చెల్లిస్తున్న పరిస్థితి కొనసాగుతున్న సమయంలో ఈ విధమైన చర్యలు తీసుకోవడం అనేది సరికాదన్నారు.అలాగే డిగ్రీ సెమిస్టర్ ఫీజ్ ను పోయిన సంవత్సరం కంటే ఇప్పుడు రూ.300 నుంచి రూ.400 పెంచి విద్యార్థులతో వసూలు చేస్తున్నారన్నారు.ఇప్పటికే ఉన్న ఫీజు రెండు తట్టుకోలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో మళ్లీ వారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం అనేది సరైనది కాదని పిడిఎస్యు నేతలు తెలిపారు.వెంటనే ఆ ఫీజ్ ను ఉపసంహరించుకొని విద్యార్థులపై భారాన్ని తగ్గించాలని వారు కోరారు. ఇప్పటికైనా ఆలోచించేసి డిగ్రీ సెమిస్టర్ ఎగ్జామ్ డేట్ ను నవంబర్ నుంచి డిసెంబర్ కు పొడిగించాలని వారు డిమాండ్ చేశారు.ఒకవేళ లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పాలమూరు యూనివర్సిటీ దగ్గర నిరసన కార్యక్రమాలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా నాయకులు రమేష్ నాయక్,నాయకులు శివ, శ్రీకాంత్,అరుణ్,అశ్విని, కళ్యాణి,కల్పన,నాగరాజు, చింటూ,బాల నర్సమ్మ, నవిత,జి.అశ్విని,రాము విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తగా బోరుబావులు తవ్వితే సీజ్ చేస్తాం:జిల్లా కలెక్టర్

ఆరుతడి పంటలనే సాగు చేయాలి ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27 (డీకే చాటింపు): ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగ ణనలోకి తీసుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచిం చారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూము లు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలిడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు. నందిపేట మండలం నూత్ పల్లి రైతు వేదికలో మంగళ వారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతుల నుద్దేశించి మాట్లాడా రు. ఖరీఫ్ లో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి ఉ ండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతీకూల పరిస్థితు లను దృష్టిలో ఉంచు కొని వ్యవసాయ రంగంలో తీసుకోవా ల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్క జొన్న, కూరగాయలు వంటి పంటల సాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులను ప్రోత్సహిం చారు. బిందు సేద్యాన్ని వినియో గించుకొని ఆయిల్ పామ్ తోటలు, కూర గాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగిం చుకోవచ్చని అన్నారు. ఆరుతడి పంటల సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరపున తోడ్పాటును అందిస్తా మని భరోసా కల్పించా రు. మల్చింగ్, బిందు సేద్యం విధానాలకు రాయితీ వర్తించేలా ప్రణాళికలు రూపొంది స్తామని అన్నారు. కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా తగిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. వీబీజీరాంజీ కింద ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందిం చుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కొత్తగా బోరుబావులు తవ్వ కూడదని, ఎవరైనా తవ్వితే వాటిని సీజ్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతు న్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకో వాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బం దుల్లో పడవద్దని జిల్లా పాలనాధికారి హితవు పలికారు. ప్రజాప్రతి నిధులు, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు సైతం రబీలో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పిం చాలని అన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు తమ అభి ప్రాయాలను వెల్లడించ గా, రబీలో ఏ తరహా పంటలు సాగు చేయ వచ్చు, కరువు పరిస్థి తులను అధిగమిం చేందుకు అనుసరిం చాల్సిన విధానాలు ఏమిటీ తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధి కారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్, బోర్గాం ప్రభుత్వ పాఠశాలలో

టీచర్ల సమస్య లు తీర్చండి

టీ జి వి పి నాయకుల డిమాండ్



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 27 (డీకే చాటింపు): తెలంగాణ విద్యార్థి పరిషత్ (ఏ+ఎా) ఆధ్వర్యంలో ఈరోజు మాక్లూర్ మరియు బోర్గాం (ఖ) ప్రభుత్వ పాఠశాలలను సందర్శిం చారు . ఈ సందర్భంగా TGVP నగర అధ్యక్షు డు అఖిల్ మాట్లాడు తూ,మాక్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 180 కి పైగా ఉన్నప్పటికీ, కేవలం ముగ్గురు ఉ పాధ్యాయులు మాత్రమేఉన్నారని క్లాసులు కంబైన్డ్ చేయకుండా తీవ్ర ఇబ్బందుల నడుమ చదువు చెబుతు న్నారని, దీనిపై ఐజూ, వీజూ లకి ఫిర్యాదు చేసినా అధికారుల నుండి స్పందన లేదని హెడ్మాస్టర్ ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అలాగే 350 మంది విద్యార్థులున్న మాక్లూర్ హైస్కూల్లో మిగతా సబ్జెక్టులకు ఇద్దరేసి టీచర్లు ఉన్నా, తెలుగు మరియు హిందీ సబ్జెక్టులకు మాత్రం కేవలం ఒక్కొక్క టీచరే ఉండటంతో క్లాసులు కంబైన్డ్ చేసి చెప్పాల్సి వస్తోందని మండి పడ్డారు. పాఠశాలలో కనీస వసతులు కరువయ్యాయని, విద్యార్థులకు తాగడా నికి వాటర్ ప్లాంట్ ఉ న్నప్పటికీ అది రిపేర్ రావడం వల్ల పని చేయడం లేదని, ఫ్యాకల్టీ వద్ద వివరాలు అడగగా అది రిపేర్లో ఉందని చెప్పారని, దీంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో బోర్ నీళ్లు తాగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాక్లూర్ హైస్కూల్ విద్యార్థు లతో కలిసి TGVP నాయకులు మధ్యా హ్న భోజనం చేసి, విద్యార్థుల సమస్య లను అడిగి తెలుసు కుంటూ స్కూళ్లలో కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వాటర్ ప్లాంట్ను వెంటనే రిపేర్ చేయించాలని డిమాం డ్ చేశారు. ఇదే క్రమం లో బోర్గాం (K) ప్రభుత్వ పాఠశాలలను కూడా సందర్శించి, అక్కడ ప్రధానపుపా ధ్యాయుడితో మాట్లాడటంతో పాటు విద్యార్థులతో కూడా ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలు సుకోవడం జరిగిందని తెలిపారు. వారం రోజుల్లోగా మాక్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదనపు ఫ్యాకల్టీని కేటాయించ కపోయినా, హైస్కూల్ కు తెలుగు, హిందీ టీచర్లను నియమించ కపోయినా, వాటర్ ప్లాంట్ను బాగు చేయించకపోయినా మరియు విద్యాశాఖ అధికారులు స్పందిం చకపోతే,ఏ+ఎా ఆధ్వర్యంలో తల్లి దండ్రులు, విద్యార్థ లతో కలిసి పెద్ద ఎత్తున మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అఖిల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో TGVP నాయకులు హేమంత్, సన్నీ, సాయి, నైతిక్, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోరియస్ హైస్కూల్ ను సందర్శిం చిన

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య



ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 27 (డీకే చాటింపు): విద్యార్థులకు నాణ్య మైన విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించాలనీ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు.ఆర్మూర్ పట్టణ పరిధిలోని మామిడి పల్లి గ్రామ శివారులో ఉన్న గ్లోరియస్ హై స్కూల్ (Glorious High School), తపస్వి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ను నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సందర్శిం చారు. పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలి ంచి, విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానం, విద్యార్థులకు బోధిస్తున్న పద్ధతులు, వారికి అందిస్తున్న భోజన వసతులు, ఇతర మౌలిక సదుపా యాల గురించి యాజ మాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు.
విద్యార్థుల విద్యాభి వృద్ధి, వారి దైనందిన జీవన పరిస్థితులు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల పాఠశాల యాజమా న్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు,
వారి ఆరోగ్యం, భద్రత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత, మంచి నడవడిక, మానవీయ విలువలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచిం చారు.
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని, వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పిం చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకాటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ సీఐ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం,అక్టోబర్,28, 2026

ఇది ఉద్వేగం కాదు.. మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతఃసిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం “అదుపు తప్పిన కోరిక”, “క్షణిక ఉద్వేగం”, “ఆవేశం” వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేస్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగించడం ఏ రకపు ఉద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి ! పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులుగా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు.”అతను అలాంటి వాడని అనుకోలేదు.” అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మనుషులను అర్థం చేసుకునే మన సామర్థ్యపు సమస్య, విలువల సమస్య. మనం చూసేది ఒక పబ్లిక్ ఇమేజ్‌ని మాత్రమే అయితే? మనకు కనిపించని అతని మరో ప్రపంచం!? ఆ చీకటిని ముందుగానే గుర్తించలేని మన నమ్మకం!? ఇవన్నీ ప్రశ్నలే.



జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపే లక్ష్యంగా

ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర..

- పాల్గొన్న బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి-ప్రజల పక్షాన రాజీలేని పోరాటం..

డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్,(డీకే చాటింపు) జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా కాలుష్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్షలాది మంది ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు ఈటల రాజేందర్ గారు చేపట్టిన పాదయాత్రలో గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపు, కాలుష్య నియంత్రణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎంపీ ఈటల రాజేందర్ గారు బాధిత ప్రజల పక్షాన పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా డంపింగ్ యార్డు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాశ్వత పరిష్కారం సాధించడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశం.ప్రజల పక్షాన నిలబడి, జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించాలనే లక్ష్యంతో ఎంపీ శ్రీ ఈటల



రాజేందర్ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా నిలుస్తూ, ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

బీసీ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

-నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం-

సరైన పత్రాలు లేని 41 వాహనాలు సీజ్-నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య...







నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు డీఎస్పీ నల్లపు లింగయ్య ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొని కాలనీలోని180 ఇళ్లను విస్తృత స్థాయిలో తనిఖీలు చేశారు.సరైన వాహన పత్రాలు లేని 41 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు.వీటిలో 38 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు ఉన్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో పోలీసులు సమావేశమై నేరాల నియంత్రణ,ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కాలనీలో దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని,సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని ఆయన వివరించారు.అలాగే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని,గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని,ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ప్రజల భద్రత,నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా పోలీస్ శాఖతో కలిసి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని డీఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సిఐ శివశంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు,సతీష్ రెడ్డి,గాయత్రి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ బీరప్ప స్వామి కమరాతి దేవి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఏఐపీసీ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్

ఎల్బీనగర్, అక్టోబర్ 27 (డీకే చాటింపు) కర్మన్‌ఘాట్ – బైరామల్ గూడ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ బీరప్ప స్వామి కమరాతి దేవి కళ్యాణోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులైన చీర ప్రదీప్ కురుమ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఏఐపీసీ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు, కొత్త కుర్మ శివకుమార్ కురుమ, మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, కర్మన్‌ఘాట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకుల రమాకాంత్ గుప్తా, ఏపూరి బద్రీనాథ్ గుప్తా, ఎరుకల విశ్వనాథ్ గౌడ్, చీర బాలరాజు చీర అభిలాష్ కురుమ, శ్రీకాంత్ గౌడ్, నోముల రవీందర్ గౌడ్, జక్క సందీప్, మాడూరి శివ కురుమ, కళ్యే క్రాంతి కుమార్ మరియు కమిటీ సభ్యులు పాల్గొని ఘనంగాసన్మానించడం జరిగింది మొదలగువారు ఈ యొక్క కళ్యాణోత్సవ కార్యక్రమంలో పాల్గొని భగవంతుని దర్శించుకోవడం జరిగింది



మాధవ నగర్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలి

భారతీయ జనతా యువమోర్చా నాయకుల డిమాండ్

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 27 (డీకే చాటింపు): నిజామాబాద్ మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో సోమవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విద్యార్థుల సామాన్యు ల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందని మాధవ నగర్ బ్రిడ్జి ఆర్ ఓ బి పనులు పూర్తి చేయుటలో స్థానిక పిసిసి ప్రెసిడెంట్ మహేష్కుమార్ గౌడ్ ,బోధన్ ఎమ్మెల్యే అధికార ప్రతినిధి సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి విఫలమయ్యారని జిల్లాలో ఈ నాయకులు ఉండి ,ఏళ్ల తరబడి పనిలో జాప్యంచేయడంలో సిగ్గు చేటని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్, ఉపాధ్యక్షులు రాజ్ గణేష్, విపుల్, ప్రధాన కార్యదర్శి అర్జున్, అధికార ప్రతినిధి శేఖర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలువనిత లు దుయ్యబట్టారు.ప్రజల ఇబ్బందులు గాలికి వదిలేసి స్వంత పనులకే కాంగ్రెస్ నాయకులు పరిమితం అయ్యారని అన్నారు. 10 సంవత్స రాలు అయిన పనులు పూర్తి చేయకపోవడం సిగ్గు సిగ్గు అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు విడుదల చేసిన, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేయడంలో జాప్యం సిగ్గు చేటని



అన్నారు.విద్యార్థులు,యువకులు అంటే లెక్కలేదా అని ప్రశ్నించారు.ధర్నాలో ఎస్ఆర్ కాలేజీ , నారాయణ కాలేజీ , తిరుమల కాలేజీ తదితర కాలేజీల విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెంటనే మంజూరు చేసి వేసవి లోగా పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్మూర్ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ గా సయ్యద్ ఆవేజ్

కార్యవర్గం ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షుడు

ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 27 (డీకే చాటింపు): ఆర్మూర్ నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యవర్గాన్ని ఈరోజు రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిలోజు ప్రకటించారు. ఆర్మూర్ నియోజకవర్గ కన్వీనర్ గా సయ్యద్ అవేజ్ సహాయ కన్వీనర్ గా దేగాం సాయి తేజ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రజాక్ కార్యదర్శిగా కోటారి కృష్ణ జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ అదేవి ధంగా బీసీ ఓబీసీ కన్వీనర్‌గా ధోని హంసరాజ్ మహిళా శక్తి కన్వీనర్ గా అల్జాపూర్ గంగామణి నియమించినట్లు కన్వీనర్ సయ్యద్ అవేజ్ తెలి పారు. మహిళా శక్తి కార్యదర్శిగా జ్యోతి మహిళా, యువజన విభాగం కన్వీనర్ గా అబ్దుల్ రహీం, కార్యదర్శిగా ఎంఏ ఫుర్ఖాన్,మైనారిటీ కన్వీనర్‌గా మహమ్మద్ అబ్దుల్ షకీల్, కార్యదర్శిగా మహమ్మద్ వహీద్ లను నియమించినట్లు తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గ ప్రజల గొంతుకగా పనిచేస్తామని అభివృద్ధి నిరోధకులను అడ్డుకుంటామని కన్వీనర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

టీపీసీసీ చీఫ్ కు ఏపీసీసీ చీఫ్ ఆహ్వానం



(డీకే చాటింపు,హైదరాబాద్): టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దంపతులను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ వారికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ దంపతులను వివాహ వేడుకకు ఆహ్వానించారు.

ఆయుష్ మిషన్ ద్వారా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం...

జనగామ అక్టోబర్ 27 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి వరంగల్ జిల్లా జాతీయ ఆయుష్ మిషన్ పథకం కింద వరంగల్ జిల్లాలోని ఆయుష్ శాఖలో ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత జిల్లా అధికారులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ ఈ నియామకాల్లో భాగంగా పీజీ అర్హత కలిగిన ఆయుష్ డాక్టర్ పోస్టు ఒకటి, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు నాలుగు, డైటీషియన్ పోస్టు ఒకటి, సైకోసోషియల్ కౌన్సిలర్ పోస్టు ఒకటి, యోగా ప్రొఫెషనల్ పోస్టు ఒకటి, మల్టీ పర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) పోస్టులు నాలుగు భర్తీ చేయనున్నామని తెలిపారు.అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, ఇతర నిబంధనలను వరంగల్ జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://warangal.telangana.gov.in/ లో తెలుసుకోవచ్చని జిల్లా ఆయుష్ శాఖ అధికారులు సూచించారు.

అంబేద్కర్ చౌరస్తాపై మంత్రి పొన్నం ప్రభాకర్ చిన్న చూపు-బత్తుల శంకర్ బాబు..



డీకే చాటింపు, హుస్నాబాద్;హుస్నాబాద్ ప్రధాన కూడలి అయిన అంబేద్కర్ చౌరస్తాను నిర్లక్ష్యం చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై చిన్నచూపు వహించడం చాలా బాధాకరం అని భాజపా పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆరోపించారు. ప్రధాన రహదారి విస్తరణ జరిగినప్పటి నుంచి దుమ్ము ధూళితో నిండిపోతుందని, అభివృద్ధి పనులు ఇన్ని రోజులైనా పూర్తి కాకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ప్రధాన కూడలిలో నాలుగు వైపులా మట్టి రోడ్డుపై పేరుకపోవడంతో వచ్చి పోయే వాహనాలతో నిత్యం చౌరస్తా దుమ్ము ధూళితో నిండిపోతుందని, దీంతో వాహనదారులు, సమీప వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వ్యాపారులు, ప్రజలతో కలిసి పెద్దయెత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

లోటస్ పాఠశాలలో ఈ-వేస్ట్ సేకరణ కార్యకమం...

బెల్లంపల్లి(డికే చాటింపు) లోటస్ ప్లే స్కూల్ లో ఈ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లోటస్ కరస్పాండెంట్ బగ్గని శేషు కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు తమ ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను పాఠశాలకు తీసుకువచ్చి, వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లాక్ డస్ట్‌బిన్‌లో వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ-వేస్ట్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటిని సరైన పద్ధతిలో సేకరించి రీసైక్లింగ్‌కు పంపించాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు ఈ-వేస్ట్‌ను సక్రమంగా నిర్వహిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశంతో విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జాతీయ స్థాయి
క్రీడా పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 27 (డీకే చాటింపు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026-27 కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో ఎంపిక చేసిన క్రీడా వేదికను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జాతీయ స్థాయిలో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించ నుండగా, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహ ణకు నిజామాబాద్ జిల్లాను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ మాక్లూర్ మండలం దాస్‌నగర్ సమీపం లోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌ను సందర్శించి, టేబుల్ టెన్నిస్ పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా వేదిక, ఇతర వసతు లను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో, అన్ని ఏర్పాట్లను పకడ్బందీ గా చేపట్టాలని అధికా రులను ఆదేశించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిజామాబాద్ జిల్లాను ఎంపిక చేయడం ఎంతో ప్రతిష్టాత్మకమైన విషయమని పేర్కొం టూ, ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా పోటీలను విజయవం తంగా నిర్వహించేం దుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా అవసరమైన అన్ని మౌలిక సదుపా యాలను సమకూ ర్చాలని, వారి భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు రోజుల పాటు పోటీలు కొనసాగ నున్నందున, క్రీడాకా రుల వసతి, భోజనం, తాగునీరు, పారిశు ద్ధ్యం, వైద్య సేవలు తదితర సదుపాయా



లను సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు.జాతీయ స్థాయి క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం గా నిర్వహించడం ద్వారా నిజామా బాద్ జిల్లాకుమంచి గుర్తింపు తీసుకురావాలని, ఇందు కోసం సంబంధి త శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం ఇంకనూ ఏవైనా సదుపాయాలు అవసరమైతే ప్రతిపా దనలు సమర్పించాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, నవ్య భారతి స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, లత,స్థానికఅధికారులు పాల్గొన్నారు.

15వ రోజుకు చేరినఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమ్మె
సమస్యల పరిష్కారా నికి ప్రభుత్వ సలహా దారు సుదర్శన్ రెడ్డి హామీ





నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉ ద్యోగులు ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డిని జేఏసీ సభ్యులు కలిశారు. ఉద్యోగుల న్యాయమైనా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తమ హక్కులను కాపాడా లని విన్నవించారు. సమ్మె 15వ రోజు కు చేరుకుందని ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి దృష్టికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి సమస్యలను విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు.

బెల్లంపల్లి 1 టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్..

బెల్లంపల్లి (డికే చాటింపు) పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని బెల్లంపల్లి 1టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్థానిక పాఠశాల విద్యార్థులకు 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ?ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ కె శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరు, రిసెప్షన్ డెస్క్, మహిళా హెల్ప్ డెస్క్, కేసుల నమోదు విధానం మరియు లాకప్ రూమ్స్ గురించి సమగ్రంగా వివరించారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎలా పనిచేస్తారు, శాంతిభద్రతలను కాపాడటంలో వారి పాత్ర ఏంటి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు.?ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి



1టౌన్ సీఐ కె శ్రీనివాస రావు, ఎస్సై డి. రామకృష్ణ పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ట్రంప్ కొత్త పేరు..

ఏఐకి బదులు 'సూపర్ ఇంటెలిజెన్స్' పదాన్ని వాడనున్న అమెరికా ఈ పదాన్నే అధికారికంగా ఉపయోగించాలని ట్రంప్ ఆదేశాలువైట్‌హౌస్‌లో టెక్ దిగ్గజాలతో సమావేశంలో కీలక ప్రకటనఇంటర్నెట్ ఆవిష్కరణ కన్నా ఇది పెద్ద విప్లవమని వ్యాఖ్యఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అధికారికంగా వినియోగించే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) అనే పదం స్థానంలో ఇకపై 'సూపర్ ఇంటెలిజెన్స్' (ఎస్ఐ) అనే పదాన్ని వాడనున్నట్లు ఆయన ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, జెన్సన్ హువాంగ్ వంటి టెక్ దిగ్గజాలతో నిర్వహించిన విందు సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఆర్టిఫిషియల్' అనే పదం ఈ సాంకేతికత యొక్క అసలు సామర్థ్యాన్ని తక్కువ చేసి చూపుతోందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు మరియు ప్రకటనల్లో 'సూపర్ ఇంటెలిజెన్స్' అనే పదాన్ని వినియోగించాలని ఆయన ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ సాంకేతికత ప్రపంచంపై, ముఖ్యంగా అమెరికాపై పెను ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు."ఇది ఇంటర్నెట్ ఆవిష్కరణ కంటే గొప్పది. ఇంతటి విప్లవాత్మక సాంకేతికతను



మనం గతంలో ఎప్పుడూ చూడలేదు. టెక్నాలజీ రంగంలో అమెరికా అద్భుతమైన పురోగతి సాధిస్తోంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మానవాళి సంక్షేమానికి ఈ టెక్నాలజీని ఉపయోగించాలని ఆశిస్తున్నామని, ఒకవేళ ఇది అదుపుతప్పితే ప్రభుత్వం కచ్చితంగా జోక్యం చేసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, సాంకేతికంగా మానవ మేధస్సును అన్ని రంగాల్లో మించిపోయే సామర్థ్యమున్న 'సూపర్ ఇంటెలిజెన్స్' ఇంకా అందుబాటులోకి రాలేదని, ప్రస్తుతం ఉన్నది కేవలం ఏఐ మాత్రమేనని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇందిరమ్మ భీమాతో కలిసొచ్చేనా..?

హైదరాబాద్, (న్యూస్ పల్స్) : తెలంగాణలో మరో కీలక హామీ అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో పలు కీలక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.., అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయట్లేదనే విమర్శలు ఎదర్కొంటోంది. అలాంటి వాటిలో ఇందిరమ్మ బీమా పథకం ఒకటి. ఇప్పుడు ఈ స్కీంను అమలు చేసేందుకు సన్నద్ధమైంది. నవంబర్ 19న ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. వీటిని కచ్చితంగా అమలు చేస్తామని మాటిచ్చింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహజ్యోతి), రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంపు వంటి వాటిని ఇప్పటికే అమలు చేస్తోంది.తాజాగా 'ఇందిరమ్మ బీమా' ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఉచిత బీమా కవరేజ్ కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు ఈ బీమా పథకం ఒక పెద్ద దిక్కుగా మారుతుందనడంలో సందేహం లేదు. ఇందిరమ్మ బీమా పథకాన్ని నవంబర్‌లో ప్రారంభించడం ద్వారా, రాబోయే గ్రాడ్యుయేట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతును మరింత సుస్థిరం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.పథకాలను అనౌన్స్ చేయడం సులభం. అయితే క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఎటువంటి అవినీతికి తావులేకుండా ఈ బీమా ఫలాలను చేరవేయడం ప్రభుత్వానికి అసలు సిసలు పరీక్ష. గతంలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, పారదర్శకమైన విధానంలో ఈ బీమాను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యారంగంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులకు, ఈ బీమా పథకం కూడా తోడైతే ప్రభుత్వానికి తిరుగుండదని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

రకుల్ చుట్టూ రాజకీయాలు!






ముంబై , (న్యూస్ పల్స్) : సినీనటి రకుల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటి అధికారులు సోదాలు మొదలుపెట్టారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మొత్తం 12 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేశారు. మధ్యాహ్నం దాటిన తర్వాత ఐటీ అధికారులు ఒక్కసారిగా బృందాలుగా విడిపోయి 12 ప్రాంతాలలో తనిఖీలు చేయడం మొదలుపెట్టారు.సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను మళ్లించారని తెలుస్తోంది. ఇలా నిధులు మళ్లింపు విషయంలో కొన్ని కీలక విషయాలను దాచిపెట్టడం ఐటి అధికారులకు అనుమానం కలిగించింది. దీంతో కొద్దిరోజులుగా వారు లోతుగా ఈ వ్యవహారాన్ని తవ్వుతున్నారు. దీంట్లో అనుమానాస్పద లావాదేవీలు కనిపించిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. రకుల్ మామ వషూ భగ్నాని కార్యాలయంలో కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. రకుల్ ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో కీలకమైన పత్రాలు.. రికార్డులను అధికారులు పరిశీలించినట్లు సమాచారం.రకుల్ కు తెలుగు చిత్ర పరిశ్రమలో అంతగా అవకాశాలు రావడం లేదు. దీంతో ఆమె బాలీవుడ్లో సినిమాలు చేస్తోంది. ఆమె నటించిన సినిమాలు కూడా అంతగా ఆడటం లేదు. అయినప్పటికీ ఆమెకు వరుసగా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. పైగా రియాల్టీ షోలలో.. టాక్ షోలలో ఆమె పాల్గొంటునే ఉంది. పైగా అప్పట్లో రకుల్ సోదరుడు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నాడని ఆరోపణలొచ్చాయి. అతడిని పోలీసులు అరెస్ట్ కూడా చేశారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు. అయితే ప్రస్తుతం రకుల్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు చేశారని వార్తలు వస్తున్న నేపథ్యంలో టాలీవుడ్.. బాలీవుడ్..లో సరికొత్త చర్చ మొదలైంది.రకుల్ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమా ద్వారా ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వరుసగా ఆమె నటించిన సినిమాలు విజయవంతం అయ్యాయి. దీంతో టాలీవుడ్లో మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్గా ఆమె పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత చేసిన సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో ఆమెకు అవకాశాలు రావడం తగ్గిపోయింది. ఇదే అనే పద్యంలో ఆమె కొన్ని వ్యాపారాలు కూడా మొదలుపెట్టింది. ఆ తర్వాత క్రమంగా బాలీవుడ్ కు ఆమె షిఫ్ట్ అయిపోయింది. అక్కడ కొన్ని సినిమాలలో నటించింది. బలమైన పిఆర్ ద్వారా కొన్ని సినిమాల్లో అవకాశాలు పొందింది. అయితే ఆమె నటించిన సినిమాలు అంతగా ఆకట్టుకోలేదు. కెరియర్ డోలాయమానంలో ఉన్న క్రమంలో ఆమె పై ఈ స్థాయిలో విమర్శలు రావడం.. ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.రకుల్ ప్రీత్ కు వివాదాలు కొత్త కాదు. గతంలో ఆమె సోదరుడి మీద రకరకాల విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత కొన్ని వ్యవహారాలు ఆమెను వార్తల్లో వ్యక్తిగా నిలిపాయి. అయినప్పటికీ ఆమె వాటిని తట్టుకొని నిలబడింది. కానీ చివరికి ఇప్పుడు ఏకంగా ఐటీ శాఖ అధికారులు సోదాలు చేయడం చర్చకు దారి తీసింది. మరి ఈ దాడుల్లో అధికారులు ఏం స్వాధీనం చేసుకున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు.. అనే వాటిపై మరికొద్ది గంటల్లో క్లారిటీ వస్తుందని తెలుస్తోంది.

ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

హైదరాబాద్, : తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి



దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అనలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ

న్యూఢిల్లీ, : భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ-వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ-వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ-వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డావ్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ-వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ-వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థాన్ పౌరులకు మాత్రం ఈ సదుపాయాన్ని దూరంగా ఉంచారు. పాకిస్థానీ



పాస్‌పోర్టు కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ-వీసాలను మంజూరు చేయడం లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ-పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ-వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్-కేటగిరీలకు ఈ-వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు.

40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు : బాల్క సుమన్

హైదరాబాద్: సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్‌గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు.సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి అంటే సిరుల గని.సిరిసిల్లకు ఎన్ని నిధులిస్తారో చెప్పాలిసింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్ మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి.

ఖైరతాబాద్ నుంచి జనసేన పోటీ...



హైదరాబాద్, : హైకోర్టు తీర్పుతో దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటం, తెలంగాణ అసెంబ్లీ ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైంది. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ క్రియాశీలక పాత్ర పోషిస్తామని, 2029 స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ పోరులో గట్టిగా నిలబడతామని పవన్ కళ్యాణ్ ఇటీవల స్పష్టం చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్తలు, విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఇలాంటి సమయంలో ఖైరతాబాద్ ఉపఎన్నిక రూపంలో జనసేనకు మొదటి అసలైన పరీక్ష ఎదురైంది. పార్టీని తెలంగాణలో సీరియస్‌గా తీసుకోవాలంటే ఖైరతాబాద్ బరిలో నిలవడం తప్పనిసరి. బరి నుంచి తప్పుకుంటే ఆంధ్రకే పరిమితమైన పార్టీ అనే ముద్రను కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు మరింత గట్టిగా వేసే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ విషయంలో బీజేపీ శ్రేణులు ప్రత్యేక వ్యూహంతో ముందుకు వెళ్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ, ఉపఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బిజెపి తెలంగాణ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో జనసేన తప్పుకుని బీజేపీకి మద్దతు ప్రకటించింది. కానీ ఈసారి కూడా అదే పునరావృతమైతే జనసేన ఇక్కడి క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్రంగా నిరాశపరిచినట్లవుతుంది. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఖైరతాబాద్ బరిలో స్వయంగా అభ్యర్థిని దింపితే, బీజేపీతో గ్యాప్ వచ్చే ప్రమాదం ఉంది. పోనీ అభ్యర్థిని నిలబెట్టకుండా బీజేపీకి మద్దతు ప్రకటించి సైలెంట్ అయిపోదామంటే, పొత్తులు వద్దంటున్న బిజెపికే బలవంతంగా మద్దతు ఇస్తున్నారా అనే విమర్శలు ఇతర పార్టీల నుంచి వస్తాయి. అందువల్ల ఉపఎన్నికలో పోటీ చేయడం ద్వారా తెలంగాణలో తమ స్వతంత్ర ఉనికిని చాటుకోవాలా లేదా సంయమనం పాటించాలా అనే ధర్మసందేహంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు.హైదరాబాద్ నగరంలో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఆంధ్ర మూలాలు ఉన్న ఓటర్లు , అలాగే పవన్ కళ్యాణ్‌కు విశేషమైన అభిమాన గణం, యువత, బీసీ ఓటు బ్యాంకు గణనీయంగా ఉంది. పవన్ ప్రచారానికి వస్తే ఆ ప్రభావం ఖచ్చితంగా ఓట్లపై పడుతుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై అసంతృప్తిగా ఉండి, సాంప్రదాయకంగా బిజెపికి పడని ఓటర్లను ఆకర్షించే అవకాశం జనసేనకు ఉంది. ఖైరతాబాద్ వంటి కీలక స్థానంలో పోటీ చేయాలంటే కేవలం గ్లాస్ గుర్తు ఉంటే సరిపోదు.. గట్టి ఆర్థిక, అంగ బలం ఉన్న అభ్యర్థి కావాలో. స్థానికంగా బలం ఉన్న శ్రేణులను లేదా ఇతర పార్టీల నుంచి అసంతృప్త నేతలను ఆకర్షించి అభ్యర్థిగా నిలబెడితేనే పోరు ఆసక్తికరంగా మారుతుంది. ఒకవేళ క్యాండిడేట్‌ను నిలబెడితే, పవన్ కళ్యాణ్ వచ్చి స్వయంగా ప్రచారం చేయాల్సిందే. అలా చేయని పక్షంలో క్యాడర్‌కి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్, తెలంగాణలో ప్రచారానికి వస్తే వచ్చే రాజకీయ పొలిటికల్ మైలేజ్ అంతాఇంతా కాదు.ఖైరతాబాద్ ఉపఎన్నిక ప్రకటనతో జనసేన ఒక కీలక మలుపు వద్ద నిలబడింది. పొత్తులతో సంబంధం లేకుండా పోటీ చేసి తమ నిజమైన ఓటు బ్యాంకు ఎంతో తేల్చుకోవడం ఒక మార్గమైతే, బీజేపీతో సామరస్యంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావడం మరొక మార్గం. ఏది ఏమైనా, తెలంగాణలో తన 'సీరియస్‌నెస్'ను నిరూపించుకోవాలంటే పవన్ కళ్యాణ్ ఈ ఉపఎన్నికను తేలికగా తీసుకోలేరు. ఖైరతాబాద్ బరిలో జనసేన మార్క్ ఎలా ఉండబోతోందో రాబోయే కొన్ని రోజుల్లో తేలిపోనుంది.

అమెరికాకు నో చెబుతున్న న్యూ ట్రెండ్



హైదరాబాద్, : ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓ.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.అమెరికాలో ఓ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది.ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్న్‌షిప్ ప్రివేరేషన్‌పై దృష్టి పెడుతున్నారు.క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి.ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది.ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు.ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు.అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

లిక్కర్ స్కామ్ గుట్టు దొరికేసింది...



హైదరాబాద్, : వైఎస్సార్‌సీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌ను ఊపేసిన వేల కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో నాటి ప్రభుత్వం, అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. నాటి ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు పెను తుఫాను రేపుతోంది. మద్యంపాలసీ రూపకల్పన నుంచి మద్యం విక్రయాల వరకు అంతా నాటి సీఎంవో కనుసన్నల్లోనే, పూర్తి స్థాయి రాజకీయ ఒత్తిళ్ల మధ్యే జరిగిందని ఆయన న్యాయస్థానం ముందు నిజాలను పూసగుచ్చినట్లు వివరించారు. ఈ వాంగ్మూలంతో మద్యం స్కామ్ వెనుక అసలు సూత్రధారి నాటి ముఖ్యమంత్రి జగనేనన్న ఆరోపణలకు బలమైన సాక్ష్యం లభించినట్లయింది.రజత్ భార్గవ తన వాంగ్మూలంలో నాటి సీఎంవో అధికారుల పాత్రను బహిరంగంగా ఎండగట్టారు. ప్రవీణ్ ప్రకాష్, కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి వంటి అధికారులు సీఎంవో తరఫున ప్రత్యక్షంగా చక్రం తిప్పారని, తనకు , ఎక్సైజ్ శాఖ అధికారులకు నిరంతరం ఫోన్లు చేస్తూ తీవ్ర ఒత్తిడి తెచ్చారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తమకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చేలా జీవోలు ఇప్పించుకున్నారని స్పష్టం చేశారు. చివరికి ఎన్నికల సమయానికి ఈ భారీ కుంభకోణం బయటపడే ప్రమాదం ఉందని గ్రహించిన సీఎంవో పెద్దలు, స్కామ్ మొత్తాన్ని అధికారుల నెత్తిపై రుద్దేందుకు పక్కా ప్లాన్ వేశారని.. అయితే తాను మాత్రం చట్టవిరుద్ధమైన పత్రాలపై సంతకాలు చేయకుండా తప్పుకున్నానని కోర్టుకు వెల్లడించారు.ఇప్పటికే ఈ కేసులో మరో కీలక అధికారి సత్యప్రసాద్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చిన సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్రంగా స్పందించిన తీరు అందరికీ గుర్తుండే ఉంటుంది. అప్పట్లో సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని, ఆయనకు మెంటల్ సర్టిఫికెట్ ఉందంటూ తీవ్ర స్థాయిలో వ్యక్తిత్వ హననానికి దిగడమే కాకుండా మీడియా ముందే విమర్శలు గుప్పించారు. ఇప్పుడు రజత్ భార్గవ లాంటి సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా నేరుగా సీఎంవో మరియు జగన్ రెడ్డి ఒత్తిళ్ల వల్లే అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహా పూసగుచ్చినట్లు బయటపెట్టడంతో నాటి అధికార పార్టీ నేతలు డిఫెన్స్‌లో పడ్డారు.సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలాన్ని తప్పించుకోవడానికి మెంటల్ డ్రామాలు ఆడిన వైఎస్సార్‌సీపీ నేతలు, ఇప్పుడు రజత్ భార్గవ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఎలాంటి వికారపు వ్యాఖ్యలు చేస్తారోనని సర్వత్రా చర్చ నడుస్తోంది. ఐఏఎస్ అధికారులే స్వయంగా కోర్టులో సీఎంవో అక్రమాలను పూసగుచ్చినట్లు చెప్పడంతో, ఈ మద్యం కుంభకోణంలో అసలు నిందితులకు త్వరలోనే చట్టపరమైన ట్రీట్‌మెంట్ ప్రారంభం కానుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వైనం ఈ స్టేట్‌మెంట్‌తో స్పష్టంగా వెల్లడైంది.

హై రైజ్ భవనాలకు పొంచి ఉన్న నీటి ముంపు

హైదరాబాద్, : భాగ్యనగరం సహా పలు ప్రధాన నగరాల్లో ఆకాశమే హద్దుగా వెలుస్తున్న హైరైజ్ భవనాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలలో వందలాది, వేలాది ఫ్లాట్లు నివాసం ఉంటున్నాయి. ఒకే ప్రాంగణంలో వేల సంఖ్యలో జనాభా నివసించే ఈ భారీ అపార్ట్‌మెంట్లలో నిత్యం కోట్లాది లీటర్ల నీరు అవసరమవుతుంది. కేవలం భూగర్భ జలాలపై మాత్రమే ఆధారపడితే కొన్ని రోజుల్లోనే భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు పూర్తిగా వట్టిపోవడం ఖాయం. దీంతో నగరాల్లోని పెద్ద పెద్ద టవర్ల నిర్వహణకు నీటి సరఫరా అనేది ప్రస్తుతం అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారుతోంది.సాధారణంగా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు , జలమండలి అందించే తాగునీటి సరఫరాపైనే ఈ హైరైజ్ ప్రాజెక్ట్‌లు ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, మున్సిపల్ అధికారులు తగినంత నీటి కనెక్షన్‌లు లేదా మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఆయా బిల్డర్లు, నివాసితులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ నుంచి సరైన సమయంలో నీటి సరఫరా అందకపోతే, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా రోజువారీ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల అపార్ట్‌మెంట్లలో నివసించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికంగా అదనపు భారం విపరీతంగా పెరుగుతోంది.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా బిల్డర్లు ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే మున్సిపల్ జల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ అనుమతులు పొందడం, భారీ సంపులు , ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడం అత్యంత కీలకం. అంతేకాకుండా, నీటి వృధాను అరికట్టడానికి ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆ రీసైకిల్ చేసిన నీటిని ఫ్లషింగ్, గార్డెనింగ్ వంటి ఇతర అవసరాలకు విధిగా ఉపయోగించేలా అంతర్గత ప్లాంట్‌లను డిజైన్ చేయాల్సిన బాధ్యత బిల్డర్లపై ఉంటుంది.ప్రభుత్వాలు , స్థానిక సంస్థలు కూడా భారీ హైరైజ్ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందే, ఆ ప్రాంతానికి సమీపంలో తాగునీటి లభ్యత, సరఫరా సామర్థ్యం ఎంత ఉందనే దానిపై సమగ్ర అంచనా వేయాలి. తగిన మౌలిక వసతులు, తాగునీటి గ్రిడ్ కనెక్షన్లు కల్పించిన తర్వాతే భారీ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి. లేనిపక్షంలో, అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగినప్పటికీ కనీస తాగునీరు కూడా దొరకని దుస్థితి ఏర్పడి, రేపు భవిష్యత్తులో నగరాలు తీవ్రమైన నీటి యుద్ధాలను ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

ఖైరతాబాద్ లో లక్షా 23 వేల ఓట్లు గల్లంతు..?

హైదరాబాద్, : దానం నాగేందర్ పై అనర్హత వేటు పడడంతో ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే ఇప్పుడు ఖైరతాబాద్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రధాన రాజకీయ పార్టీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నియోజకవర్గంలో ఊహించని విధంగా అనర్హత ఓట్లు పెద్ద ఎత్తున తెరపైకి వస్తున్నాయి. ఏకంగా సగం మేర ఓటర్ల జాబితా నుంచి మాయం కావడం ఇప్పుడు నగర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.గతంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య సుమారు 2.93 లక్షలుగా ఉండేది. అయితే? గైర్హాజరు, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్.. తదితర కారణాలతో అధికారులు దాదాపు 1.23 లక్షల ఓట్లను తొలగించారు. దీనివల్ల ఇటీవల ప్రకటించిన ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య 1.70 లక్షలకు పడిపోయింది. ఇందులోనూ మ్యాపింగ్, ఎనామలీస్ జాబితాలో ఉన్న మరో 81 వేల మందికి పైగా ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు స్పందించి సరైన డాక్యుమెంట్లు సమర్పించని వారి పేర్లు కూడా తొలగించే అవకాశం ఉంది. అదే జరిగితే తుది జాబితా నాటికి ఇక్కడి ఓటర్ల సంఖ్య ఏకంగా 1.5 లక్షలకు పడిపోయే తీవ్ర అవకాశముంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ దాదాపు 22 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అనర్హత పడడంతో ఇప్పుడు

మరోసారి ఎన్నిక అనివార్యమైంది. ఈ తరుణంలో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గిపోవడం ఏ పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందనే దానిపై సర్వత్రా తీవ్ర చర్చ జరుగుతోంది. పైకి మాత్రం ప్రధాన పార్టీలన్నీ తమ విజయానికి ఢోకా లేదని చెప్తున్నాయి. కానీ, తెరవెనుక పరిణామాలు మాత్రం వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. గల్లంతైన ఓట్లలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సానుభూతిపరులు, కార్యకర్తలు ఉండటంతో ఎవరికి నష్టం జరుగుతుందో అంచనా వేయలేక పార్టీల వ్యూహకర్తలు తలలు పట్టుకుంటున్నారు.ఓట్ల

తొలగింపు వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతుండటంతో పార్టీలు అప్రమత్తమయ్యాయి. పార్టీ తరపున ఓట్లను పరిశీలించేందుకు ప్రత్యేక నిపుణులను, లీగల్ సెల్ ప్రతినిధులను రంగంలోకి దించారు. ముసాయిదా జాబితా పరిశీలన బాధ్యతలను కొందరి ముఖ్య నేతలకు అప్పగించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను వ్యక్తిగతంగా కలిసి, వారు సరైన డాక్యుమెంట్లు సమర్పించేలా చూడాలని నాయకులు క్షేత్రస్థాయి క్యాడర్‌ను ఆదేశించారు. అలాగే, ఎన్యుమరేషన్ ఫారాలు సక్రమంగా సమర్పించినప్పటికీ, సాంకేతిక లోపాలతో కొందరి పేర్లు ముసాయిదా జాబితాలో గల్లంతు కావడంతో, వారందరితో కొత్తగా ఫామ్-6 ద్వారా పేరు నమోదు చేయించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. నవంబర్‌లో ఎస్ఐఆర్ తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అప్పటివరకు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. =

ఎన్నికల బరిలో జనసేన ఖైరతాబాద్ ఉపఎన్నిక వేడి అప్పుడే మొదలైపోయింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కవిత పార్టీల మధ్య చతుర్ముఖ పోరు ఉంటుందనుకుంటే, ఇప్పుడు జనసేన పార్టీ ఎంట్రీతో హైదరాబాద్ రాజకీయం ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీ వేగంగా పుంజుకుంటోంది. పార్టీ జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి తెలంగాణ రాజకీయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు స్పెషల్ ప్లాన్స్ వేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రేటర్ పరిధిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ మార్కు చూపించాలంటే, ఇప్పుడు వచ్చే ఖైరతాబాద్ ఉపఎన్నికను పక్కాగా వాడుకోవాలని జనసేన ప్లాన్ చేస్తోంది.ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈసారి బీజేపీతో సంబంధం లేకుండా స్వీయ బలంతోనే ఖైరతాబాద్‌లో గ్లాస్ గుర్తును నిలబెట్టాలని జనసేన నిర్ణయించినట్లు కనిపిస్తోంది. పొత్తుల వైపు చూడకుండా ఒంటరిగానే బరిలోకి దిగి జనసేన ఓటు బ్యాంక్ ఏంటో నిరూపించుకోవాలనే ఆలోచనలో రామ్ తాళ్లూరి ఉన్నారు. గ్రేటర్ ఎన్నికలకు ముందు జరిగే ఈ సెమీఫైనల్ పోరులో ఖైరతాబాద్ లాంటి ప్రతిష్టాత్మక స్థానంలో పోటీ చేస్తే, పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం రావడమే కాకుండా అది బలమైన పునాదిగా మారుతుందని భావిస్తున్నారు.ఖైరతాబాద్ బరిలో దింపేందుకు జనసేన ఒక సీనియర్ సినీ నటుడి పేరును పరిశీలిస్తున్నట్లు ఫిలింనగర్, రాజకీయ వర్గాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అత్యంత ఆప్తుడిగా ఉంటూ, ప్రజల్లో మంచి గ్లామర్, ఫాలోయింగ్ ఉన్న ఒక ప్రముఖ నటుడిని ఈ సీటు నుంచి బరిలోకి దింపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయట. స్థానిక ఓటర్లతో పాటు యువతను, సినిమా అభిమానులను ఆకట్టుకోవడానికి ఈ గ్లామర్ కాంబినేషన్ పక్కాగా వర్కవుట్ అవుతుందని పార్టీ భావిస్తోంది.ఒకవేళ ఆ సినీ నటుడు ఖైరతాబాద్ రేసులో దిగడం నిజమే అయితే.. ఇన్నాళ్లూ దానం నాగేందర్, తలసాని కుటుంబం, బీజేపీల మధ్య నడుస్తున్న సాంప్రదాయ రాజకీయం ఒక్కసారిగా గ్లామరస్ సమరంగా మారిపోవడం ఖాయం. పవన్ కళ్యాణ్ గ్లామర్, రామ్ తాళ్లూరి వ్యూహాలు, టాలీవుడ్ నటుడి ఇమేజ్ కలసి ఖైరతాబాద్‌లో ఎలాంటి సంచలనం సృష్టిస్తాయో చూడాలి

మేడిగడ్డ పనులు మొదలు...



కరీంనగర్ : తెలంగాణలో కొంతకాలంగా రగిలిపోతున్న ప్రధాన అంశాలలో మేడిగడ్డ ఒకటి. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన బ్యారేజీలలో మేడిగడ్డ ఒకటి. అయితే ఇది కుంగిపోవడంతో రాజకీయ వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తునకు ఆదేశించింది. అయితే మేడిగడ్డను పునరుద్ధరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని, కేవలం బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా బద్నాం చేయడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ విమర్శలకు చెక్ పెడుతూ ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ దిశగా కీలక అడుగులు వేసింది.మేడిగడ్డ కుంగుబాటు కేవలం ఇంజనీరింగ్ వైఫల్యమా లేక రాజకీయ కుట్రల ఫలితమా అనే చర్చ గత రెండేళ్లుగా తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. బ్యారేజ్ కుంగిన వెంటనే ప్రతిపక్ష బీఆర్ఎస్ దీనిని కేవలం సాంకేతిక లోపంగా, ప్రకృతి విపత్తుగా అభివర్ణించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం దీనిని అవినీతి కట్టడంగా విమర్శించింది. బ్యారేజ్‌ను బాగుచేయకపోతే రాష్ట్రానికి తాగు, సాగునీటి కష్టాలు తప్పవంటూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చింది. అయినా ప్రాజెక్టు పునరుద్ధరణపై ఇన్నాళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే ఇప్పుడు పునరుద్ధరణ పనులకు నడుం బిగించింది.నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులు, ఐఐటీ బాంబే నిపుణులు, అంతర్జాతీయ కన్సల్టెన్సీల సాంకేతిక నివేదికల ఆధారంగా ప్రభుత్వం మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లకు కూడా సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికలను సిద్ధం చేసింది. బ్యారేజ్ మొత్తం వెడల్పు మేరకు ఎండ్ టు ఎండ్ డయాఫ్రమ్ వాల్ నిర్మించి, పునాది భద్రతను పటిష్టం చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా వరద ఉధృతిని నియంత్రించడానికి దిగువన ఉన్న స్టిల్లింగ్ బేసిన్‌లను బలోపేతం చేయనున్నారు. ఈ పనులను రాబోయే వర్షాకాలం లోపే.. అంటే 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడం సాంకేతికంగా క్లిష్టమైనప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా వెనుకంజ వేయబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. మేడిగడ్డను వదిలేశారు.. రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోవట్లేదు.. అనే బీఆర్ఎస్ విమర్శలకు ప్రభుత్వ నిర్ణయం గట్టి సమాధానం ఇస్తుంది. ప్రాజెక్టుల పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని, కేవలం అవినీతి బండారాన్ని బట్టబయలు చేయడమే తమ ఉద్దేశమని చాటిచెప్పినట్లయింది. ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వత పరిష్కారాలు చూపుతున్నామని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ఇది గొప్ప అవకాశంగా మారింది. రాజకీయ లబ్ధి కోసం కాలయాపన చేస్తున్నారన్న అపవాదును తొలగించుకోవడంలో రేవంత్ రెడ్డి సర్కార్ సఫలమైందనే చెప్పాలి

సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్...

హైదరాబాద

ఎన్ఆర్ఐల భూములే టార్గెట్



విజయవాడ, : కృష్ణా జిల్లా పెనమలూరులో మోసం బయటపడింది. ఎన్ఆర్ఐల భూములే టార్గెట్ చేస్తూ వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న గ్యాంగ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. రీసెంట్‌గా విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావుకు సంబంధించిన 800 గజాల భూమిని కొట్టేయడానికి ప్లాన్ చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేసి ముఠాను అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు.కృష్ణా జిల్లా పెనమలూరులో ఘరానా మోసగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఔఖీఎల పొలాలను, భూములను టార్గెట్ చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బతికి ఉన్నవారు మరణించినట్టు సర్టిఫికెట్లను సృష్టించి, వారికి నకిలీ వారసులను కూడా సిద్ధం చేసి భూములను కొట్టేయడం వీరి పని. అరెస్టైన వారిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ఎం.ఆదిరెడ్డి, ఎం.వెంకట రమణ ఫణి కుమార్, సాంబశివ ఉదయ భాస్కర్, శివ ఆంజనేయులు, అమలేశ్వర రావు ఉన్నారని గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర తెలిపారు.విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావు దంపతులకు కానూరులో స్థలం ఉంది. వారి కుమార్తె హిమబిందు అమెరికాలో ఉంటున్నారు. ఈ ఫ్యామిలీ విషయం తెలుసుకున్న నిందితులు వారి 833 గజాల స్థలాన్ని స్వాహా చేసేందుకు ప్లాన్ చేశారు. ఇందులోభాగంగా నిందితులు బాధితుడి డాక్యుమెంట్ జెరాక్స్ కాపీని సంపాదించి బతికున్న సుబ్బారావు దంపతులు చనిపోయినట్టు ఫేక్ డెత్ సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. అమెరికాలో ఉన్న అసలు కుమార్తె స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన మరో మహిళను తీసుకొచ్చి ఆమె పేరుతోనే నకిలీ కుటుంబ సభ్యుల సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. దాంతో ఆదిరెడ్డి పేరుతో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ చేయించారు. అనంతరం ఆదిరెడ్డి తన గ్యాంగ్‌లోని మరో వ్యక్తికి ఈ స్థలాన్ని రిజిస్టర్ చేశారు. అయితే ఇక్కడే నిందితులకు ఊహించని ట్విస్ట్ ఎదురైంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తికి అమ్మేందుకు ప్రయత్నించగా అతను స్థలం పూర్వాపరాలను తెలుసుకున్నారు. దీంతో ఆ భూమి అసలు యజమాని బతికే ఉన్నట్టు తెలిసిపోయింది. తన భూమిపై అక్రమ లావాదేవీలు జరుగుతున్న తెలుసుకున్న అసలు ఓనర్ సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ దొంగ వ్యవహారాన్ని మొత్తం బయటకు తీశారుఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్నవాళ్లు తమ భూముల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు. దూరంగా ఉన్న తమ భూములను పర్యవేక్షించాలని సలహా ఇచ్చారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ఉద్యోగులకు కొత్త బాధ్యతలు



విజయవాడ, : ఏపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో కేర్ టేకర్లను నియమించనుంది. మొత్తం వి222 మందిని విద్యార్థుల సంరక్షణ కోసం నియామకం చేపట్టనుంది. ఈ హాస్టల్స్‌లో కేర్ టేకర్లుగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 98 మంది మహిళా పోలీసులు, 124 మంది వీఆర్ఏలను నియమించాలని నిర్ణయించారు. త్వరలోనే వీరిని ఈ కేర్ టేకర్ పోస్టుల్లో నియమించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల సంరక్షణ కేర్ టేకర్లను నియమించనుంది. రాష్ట్రవ్యాప్తంగా కేర్ టేకర్లనుగా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 98మహిళా పోలీసులు, 124మంది వీఆర్ఏలను నియమించాలని నిర్ణయించింది. ఈ కేర్ టేకర్ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తున్నారో ఇప్పటికే స్వర్ణ సచివాలయ అధికారులు బీసీ సంక్షేమశాఖ అధికారులకు నివేదిక పంపించారు. ప్రస్తుతం ఈ ఉద్యోగులంతా సర్ ప్రక్రియలో ఉన్నారు.. ఆ బాధ్యతలు ముగియగానే వసతి గృహాల్లో కేర్ టేకర్ విధుల్లో చేరనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 993 వసతి గృహాల్లో 85 వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. వీటిలో 400కుపైగా హాస్టళ్లలో వార్డెన్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వార్డెన్లకు రెండు, మూడు హాస్టళ్లకు ఇంఛార్జ్‌లుగా నియమించారు. ఈ సమస్యను గమనించిన ప్రభుత్వం ప్రత్యాయ్నాయంగా 222 మంది కేర్ టేకర్లను నియమించాలని నిర్ణయం తీసుకుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల మహిళా పోలీసులు, వీఆర్ఏలు వార్డెన్ విధుల్ని నిర్వహిస్తారు. వసతి గృహాల్లో రోజూ మూడు పూటల విద్యార్థులకు అందుబాటులో ఉంటారు.. వారందిరి పరిరక్షణ బాధ్యతల్ని కేర్ టేకర్లుగా వీరే నిర్వర్తించనున్నారు.హాస్టళ్లలో విద్యార్థులకు చిన్న చిన్న ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాల్ని ప్రభుత్వం సమకూరుస్తోంది. హ్యాంగర్లు, డ్రైయింగ్ హ్యాంగర్లు, బాత్‌రూంలో అవసరమైన వస్తువుల్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. దీని కోసం జిల్లా కలెక్టర్లకు రూ.4.95 కోట్ల నిధులు ఇప్పటికే విడుదలయ్యాయి. అలాగే హాస్టల్స్‌లోకి దోమలు రాకుండా మస్కిటో ప్రూఫింగ్ ఏర్పాటు చేయిస్తోంది.. పారిశుద్ధ్య నిర్వహణకు శానిటేషన్ కిట్లు కూడా అందిస్తున్నారు. మొత్తం 16 జిల్లాలోని 130 హాస్టళ్ల పరిధిలో రూ.16.55 కోట్లు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 164 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ఆదేశాలిచ్చింది. ఏపీపీఎస్సీ ద్వారా తొలిసారి అసిస్టెంట్ సర్జన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. అకడమిక్ పనితీరు, ఉన్నత విద్యాభ్యాసం, సర్వీసు అనుభవం, గ్రాడ్యుయేషన్ తర్వాత సీనియారిటీ ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడతారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు

మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ, : వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల వర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక



సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం

వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి.

వైసీపీకి గడ్డుకాలం - రాజీనామాల పర్వం



విజయనగరం, : స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట వైసీపీకి వరస దెబ్బలు తగులుతున్నాయి. ఆ పార్టీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో మెరకముడిదాం వైసీపీ మండల అధ్యక్షుడుతో పాటు.. 13 గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు పార్టీని వీడారు. పైగా వీరంతా చిన్న శ్రీను అడుగుజాడల్లోనే నడుస్తామని చెప్పారు. త్వరలోనే వారంతా తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ మధ్య కాలంలో చాలామంది నేతలు ఆ పార్టీ నుంచి దూరమవుతున్నారు. ఇదే విధంగా వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. మెరకముడిదాం మండలంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంతో అక్కడి స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా హీట్ ఎక్కాయి. మెరకముడిదాం వైసీపీ మండల అధ్యక్షుడు కోట్ల వెంకట్రావుతో పాటు 13 గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్య నేతలు పార్టీని వీడారు. ఈ సందర్భంగా తమ రాజీనామా లెటర్లను వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పంపుతున్నట్టు వారు వెల్లడించారు. కాగా ఇటీవలె బొత్స సత్యనారాయణ 229 అసెంబ్లీ ఎన్నికల్లో తాను చీపురుపల్లినుంచే పోటీ చేస్తానని ప్రకటించారు.ఇదే సమయంలో ఇంతమంది రాజీనామాలు చేయడం వైసీపీకి తీవ్ర ఇబ్బందికర పరిణామంగా మారిందనే చెప్పుకోవాలి.రీసెంట్‌గా బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ కూడా భావోద్వేగానికి గురయ్యారు. అయితే ఇప్పుడు మెరకముడిదాం మండలంలో రాజీనామా చేసినవారంతా కూడా చిన్న శ్రీను అడుగుజాడల్లోనే నడుస్తామని చెప్పారు. త్వరలోనే వారంతా తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.ఏపీలో వైసీపీలో రాజీనామాల పర్వం సాగుతుంది. ఈ మధ్యకాలంలో వరసగా పలువురు కార్యకర్తలతో పాటు కీలక నేతలు సైతం పార్టీని వదిలి వెళ్లిపోయారు. కాకినాడ జిల్లా తునికి చెందిన యనమల కృష్ణుడు వైసీపీకి రిజైన్ చేసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.ఇక బుక్కపట్నం నవీన్ నిశ్చల్ కూడా ఇదే బాటలో నడిచారు. హిందూపురం వైసీపీ మాజీ అధ్యక్షుడు బుక్కపట్నం నవీన్ నిశ్చల్ పార్టీకి రాజీనామా చేసి ఆ లేఖను అధిష్ఠానానికి పంపించారు. ఇక నంద్యాలలో మాజీ సర్పంచ్‌తోపాటు దాదాపు 200 మంది నేతలు, కార్యకర్తలు వైసీపీని వదిలి తెలుగు దేశం పార్టీలో చేరారు. అలాగే గతంలో చీపురుపల్లికి చెందిన ఓ మాజీ జడ్పీటీసీ దంపతులు కూడా పార్టీకి రాజీనామా చేశారు.

సజ్జలే టార్గెట్ గా సీనియర్లు


ఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి దావానంలా వ్యాపిస్తోంది. 2024 ఎన్నికల్లో ఘోర పరాభవం తర్వాత పార్టీని పునర్నిర్మించాల్సిన తరుణంలో.. తాడేపల్లి కేంద్రంగా నడుస్తున్న కోటరీ పెత్తనం పై సీనియర్ నేతల సహనం నశించిపోతోంది. స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరిపై సొంత పార్టీ అగ్రనేతలే రగిలిపోతున్నారు. ప్రజల్లో బలమైన నేతలుగా ఎదిగి, దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో గెలిచిన సీనియర్లు సైతం తమ సమస్యలు, నియోజకవర్గ పరిస్థితులను నేరుగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పుకునే వీలు లేకుండా పోయింది. జగన్ చుట్టూ సజ్జల నిర్మించిన అభేద్యమైన ప్రహరీ ని దాటి ఏ ఫైల్ కానీ, ఏ సమాచారం కానీ అధినేత వద్దకు చేరకపోవడంతో పార్టీలో ముసలం తారస్థాయికి చేరింది.పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలోనూ, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా.. జగన్‌కు, క్షేత్రస్థాయి నాయకత్వానికి మధ్య సజ్జల ఒక సూపర్ పవర్‌లా వ్యవహరిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. రాయలసీమలో బలమైన నేతగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉత్తరాంధ్రలో సీనియర్ నాయకుడైన బొత్స సత్యనారాయణ వంటి హేమాహేమీలు సైతం నేరుగా జగన్‌ను కలవలేక, సజ్జలకే రిపోర్ట్ చేయాల్సి రావడం వారిని ఇబ్బందుల్లోకి నెట్టింది. తమ రాజకీయ అనుభవం ముందు సజ్జల ఎక్కడా సరితూగరని, కనీసం ఒక పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా కూడా పోటీ చేసి గెలవలేని వ్యక్తి ముందు తాము చేతులు కట్టుకుని నిలబడాల్సి రావడంపై సీనియర్లు తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. ప్రజాబలం ఉన్న తమపై, కేవలం జగన్ అండ చూసుకుని సజ్జల పెత్తనం చెలాయించడాన్ని పార్టీలోని పెద్ద తలకాయలు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.క్షేత్రస్థాయిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నియోజకవర్గాల్లో కూటమి ప్రభుత్వం దూకుడు, స్థానిక నాయకుల వలసలతో కేడర్ చెదిరిపోతుంటే.. తాడేపల్లి నుంచి ఎలాంటి మార్గదర్శకత్వం లభించడం లేదు. ఏ చిన్న విషయమైనా సజ్జలను బతిమాలుకోవాల్సి రావడం, ఆయన ఇచ్చే అసంబద్ధమైన సలహాలు, తీసుకునే ఏకపక్ష నిర్ణయాలతో మాజీ ఎమ్మెల్యేల్లో సింహభాగం సజ్జల ముఖం చూడటానికే ఇష్టపడటం లేదు. ఈ పరిణామాలు చూస్తుంటే.. సజ్జల విధానాల వల్లనే పార్టీ 11 సీట్లకు పరిమితమైందన్న ఆగ్రహం నేతల్లో ఏ స్థాయిలో పేరుకుపోయిందో స్పష్టమవుతోంది.సజ్జల రామకృష్ణారెడ్డి నాయకత్వం, ఆయన పెత్తనంపై తిరుగుబాటు చేయడానికి పార్టీలోని సీనియర్లంతా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఒకవేళ ఏ ఒక్క సీనియర్ నేత అయినా ధైర్యం చేసి సజ్జలపై బహిరంగంగా తిరుగుబాటు బావుటా ఎగరేస్తే.. ఆయనకు మద్దతు పలికేందుకు మెజారిటీ మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు క్యూ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఎందుకంటే వైసీపీలో ప్రస్తుతం సజ్జలకు సొంత కేడర్ గానీ, ప్రజాబలం గానీ లేదు. ఆయనకు అండగా నిలబడే నేతలు పార్టీలో వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉంటారని వైసీపీ వర్గాలకే స్పష్టంగా తెలుసు. ప్రజాక్షేత్రంలో తిరిగే నాయకులకు, తాడేపల్లి ఏసీ గదుల్లో ప్రెస్ మీట్లు పెట్టే నేతలకు మధ్య ఉన్న ఈ అంతరం ఇప్పుడు పార్టీని నిట్టనిలువునా చీల్చే స్థాయికి చేరింది.స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ క్లిష్ట సమయంలో కూడా జగన్ తన పాత వైఖరిని మార్చుకోకపోతే పార్టీకి మరిన్ని గడ్డు పరిస్థితులు తప్పవు. కనీసం ఇప్పటికైనా సజ్జల పెత్తనానికి కళ్లెం వేసి, నేరుగా నాయకులకు అపాయింట్‌మెంట్లు ఇవ్వకపోతే.. అసంతృప్త నేతలంతా మూకుమ్మడిగా తిరుగుబాటు చేయడం లేదా ఇతర పార్టీల వైపు వలస వెళ్లడం ఖాయం. ఒక అనామక వ్యవస్థ చేతిలో పార్టీని బందీగా మార్చి, ప్రజానేతలను అవమానించే సంస్కృతిని కొనసాగిస్తే.. రేపు తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్, సజ్జల తప్ప మిగిలే వారెవరూ ఉండరనే చేదు నిజాన్ని వైసీపీ శ్రేణులే బహిరంగంగా చర్చించుకుంటున్నాయి.

బాలినేని తగ్గని ప్రయారిటీ

ఒంగోలు, : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి పవన్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఇది జనసేనలో చర్చనీయాంశమైంది. నిన్నమొన్నటి వరకూ బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ లేదని భావించిన వారి నోళ్లను పవన్ ఒక్క చర్యతో మూయించగలిగారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై త్రీ మెన్ కమిటీలో స్థానం కల్పించారు. నిజానికి ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స చేయించుకోవడానికి వెళ్లిన సమయంలో ముఖ్యమైన సమావేశాలకు బాలినేని శ్రీనివాసరెడ్డి కి ఆహ్వానం అందలేదు. దీంతో జనసేనలో బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రయారిటీ తగ్గిందని అందరూ అనుకున్నారు. కొందరు ఆయన వ్యతిరేకులు గేలిచేశారు. మరికొందరు బాలినేని వైసీపీ కోవర్టు అంటూ ప్రచారాన్ని కూడా నిర్వహించారు. కానీ బాలినేని శ్రీనివాసరెడ్డి నిబద్ధత తెలిసిన పవన్ కల్యాణ్ ఆయనకు కీలక బాధ్యతలను అప్పగించడంతో ఆ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లయింది. బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జల్లాల బాధ్యతలను అప్పగించారు. సామినేని ఉదయ భానుకు, నాదెండ్ల మనోహర్ కు కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతను అప్పగించారు. దీంతో బాలినేని శ్రీనివాసరెడ్డికి ఏ మాత్రం ప్రాధాన్యత తగ్గలేదని చాటి చెప్పారు. బాలినేని శ్రీనివాసరెడ్డి వల్ల చేరికలు కూడా ఊపందుకుంటాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోనూ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ బలమైన నేతలను జనసేన పార్టీలోకి తీసుకు వచ్చేందుకు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పటికే కొందరితో టచ్ లో ఉన్నారు. రాయలసీమకు చెందిన ఒక వైసీపీ ముఖ్య నేత కూడా త్వరలో వస్తారని చెబుతున్నారు. అయితే ఆ నేత పేరు ఎవరన్నది బయటపెట్టకపోయినా త్వరలోనే ఆ నేత జనసేన తీర్థం పుచ్చుకుంటారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ అందుకే బాలినేనికి కీలక బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకూ తన చుట్టూ ఉన్న నేతలు ఎవరూ ఒక్క నేతను కూడా పార్టీలోకి తీసుకు వచ్చే ప్రయత్నంచేయలేదని పవన్ కల్యాణ్ గుర్తించినట్లు కనిపిస్తుంది. జనసేన ఎప్పుడూ ఇలాగే ఉంటే ఇక ఎదిగే అవకాశం లేదని భావించిన పవన్ కల్యాణ్ కొంత పార్టీలో దిద్దుబాటు చర్యలకు దిగారనిపిస్తోంది. వైసీపీ నుంచి వచ్చిన నేతలయినా అక్కున చేర్చుకుంటే వారు నమ్మకంగా ఉండటమే కాకుండా ఇతర నేతలను కూడా తీసుకు వస్తారని, కానీ తొలి నుంచి తన వెంటే నడుస్తున్నా, మరొక నేతను పార్టీలోకి తీసుకు రాకపోవడంపై పవన్ కు అనుమానం కలిగినట్లుంది. అందుకే కొన్ని కీలక బాధ్యతలు బాలినేని శ్రీనివాసరెడ్డికి, సామినేని ఉదయభానుకు అప్పగించారు. ఇప్పటికే బాలినేని కొందరిని, సామినేని ఉదయభాను మరికొందరిని పార్టీలోకి తీసుకు వచ్చారు. దీంతో పవన్ కు మరింత నమ్మకం పెరిగింది. పార్టీ ఇంకా బలోపేతం కావాలంటే చేరికలు అవసరమని భావిస్తున్న పవన్ కల్యాణ్ తన ప్రయారిటీ ఇదీ అని ఇటు నేతలకు చెప్పకనే చెప్పారనిపిస్తుంది. మరి పవన్ కల్యాణ్ ఈ రకమైన చర్యలతోనైనా పార్టీ బలోపేతం అవుతుందా? లేదా? అన్నది చూడాలి.

కూటమి లోపాలే...వైసీపీకి వరాలా

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలు అధికార కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు పెద్ద సవాలుగా మారతాయని ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ అంచనా వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల పరిధిలో సీట్ల సర్దుబాటు ఒక ఎత్తయితే.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉండే వేలాది వార్డులు, పంచాయతీలు, జడ్పీటీసీ స్థానాల్లో స్థానిక నాయకుల ఆశలను సమన్వయం చేయడం అసాధ్యమని జగన్మోహన్ రెడ్డి భావించారు. ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ మూడు పార్టీల నుంచి ఆశావహులు పోటీపడటం వల్ల కూటమిలో అంతర్గత కుమ్ములాటలు వచ్చి, తమకు రాజకీయంగా పెద్దపీట దక్కుతుందని వైఎస్ఆర్‌సీపీ ఆశించింది. అయితే, ఈ ప్రతిపక్ష వ్యూహాన్ని కూటమి అగ్రనాయకత్వం ముందే పసిగట్టి చురుగ్గా అడుగులు వేస్తోంది.గ్రామ స్థాయి నుంచి అసంతృప్తులు రేగకుండా కూటమి పెద్దలు పవర్ షేరింగ్, కో-ఆర్డినేషన్ సూత్రాన్ని అమల్లోకి తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన 80:15:5 ఫార్ములాను లేదా స్థానిక బలాబలాల ఆధారంగా సీట్ల పెంపకాన్ని స్పష్టమైన రూట్ మ్యాప్‌తో పరిష్కరించాలని



నిర్ణయించారు. పంచాయతీ లేదా వార్డు స్థాయిలో ఏ పార్టీకి బలం ఉంటే అక్కడ ఆ పార్టీ అభ్యర్థికి మిగిలిన రెండు పార్టీలు మద్దతు తెలిపేలా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ అధిష్ఠానం నిరంతరం సమాచార మార్పిడి చేసుకుంటూ, క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు.వైఎస్ఆర్‌సీపీ వ్యూహం వెనుక మరో బలమైన కారణం ఉంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీలో టికెట్లు దక్కని ఆశావహులు తిరుగుబాటు చేయడం సహజం.

నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ..

దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిఫ్టీ వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఐటీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడం, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడింది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 329.91 పాయింట్లు (0.44 శాతం) నష్టపోయి 74,529.08 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 85.30 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 23,329.00 వద్ద ముగిసింది. నాలుగు రోజులుగా మార్కెట్లు లాభాల్లో కొనసాగిన నేపథ్యంలో హెవీవెయిట్ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించడంతో సూచీలపై ఒత్తిడి పెరిగింది.

రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. ఐటీతో పాటు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ఫార్మా సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. మరోవైపు మీడియా, రియల్ ఎస్టేట్, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. ఈ రంగాల సూచీలు లాభాల్లో ముగియడంతో మార్కెట్‌లో నష్టాలు కొంతమేర పరిమితమయ్యాయి. నిఫ్టీ 50లో ట్రెంట్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. హెవీవెయిట్ స్టాక్స్‌లో అమ్మకాలు మార్కెట్‌పై ప్రభావం చూపాయి. బ్రాడర్ మార్కెట్‌లో కూడా కొంత బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.23 శాతం నష్టపోయాయి. ప్రస్తుత ట్రేడింగ్ సరళిని పరిశీలిస్తే కొన్ని రంగాల్లో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరిస్తూ, ఇతర రంగాల్లో కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ కదలికలు సూచిస్తున్నాయి. వరుస లాభాల తర్వాత మార్కెట్లలో వచ్చిన ఈ నష్టాలు లాభాల స్వీకరణకు సంబంధించిన సాధారణ మార్కెట్ కదలికల్లో భాగంగా కనిపిస్తున్నాయి. రానున్న సెషన్లలో రంగాలవారీగా కొనుగోళ్లు, అమ్మకాల ధోరణి మార్కెట్ కదలికలకు కీలకంగా మారనుంది.



ఇప్పుడప్పుడే చర్చల్లేవ్ – జెడి వాన్స్ వెల్లడి...

ఇరాన్ విషయంలో ఏం చేయాలనే దానిపై అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పారు. ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అనేక మార్గాలు తమ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అయితే ఇరాన్‌తో ఇప్పుడప్పుడే చర్చలు జరిపే ప్రసక్తే లేదని తెలిపారు. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు ఆపేంతవరకూ ఆ దేశంతో చర్చలు జరపబోమని అన్నారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వాన్స్ అధ్యక్షభవనంలో విలేకరులతో మాట్లాడారు. 'దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపేంతవరకూ ఇరాన్‌తో చర్చించబోమని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు' అని గుర్తు చేశారు. వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపుతున్న దాడులు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడానికి ప్రధాన అడ్డంకిగా మారాయని చెప్పారు. చర్చలు తిరిగి ప్రారంభం కావాలంటే నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఇరాన్ ఆపేయాలని సూచించారు. ఇరాన్‌పై తాము చేపట్టిన సైనిక చర్యల కారణంగానే హార్ముజ్‌లో నౌకాయానం పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరిగే వరకూ ఘర్షణలు కొనసాగుతాయా అని విలేకరులు ప్రశ్నించగా 'నేను దానిని యుద్ధంగా అనుకోవడం లేదు' అని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి కాల్పులు జరగడం లేదని, ఆరు వారాల తర్వాత ప్రధాన ఆపరేషన్స్ ముగిసిపోయాయని చెప్పుకొచ్చారు. అయితే కొన్ని ప్రాంతాలలో తిరిగి పోరు ప్రారంభమైందని, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితికి ముగింపు లభిస్తుందా అని అడిగిన ప్రశ్నకు వాన్స్ బదులిస్తూ నిర్దిష్టమైన గడువు ఏదీ చెప్పలేనని, నౌకలపై జరుగుతున్న దాడులకు సంబంధించి ఇరాన్ నిర్ణయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పారు. అసలు ఈ ప్రశ్నను ఇరాన్‌నే అడగాలని సూచించారు. పరిస్థితి క్షీణిస్తే ఇరాన్‌పై వేర్వేరు రూపాలలో ఒత్తిడిని కొనసాగిస్తామని అన్నారు. వెనిజులా చమురు నిల్వలపై నియంత్రణను అమెరికాకు బదిలీ చేసేందుకు ఉద్దేశించి కుదుర్చుకున్న ఒప్పందంతో అంతర్జాతీయ చమురు ధరలు దిగివచ్చాయని చెప్పారు. ఇరాన్‌పై తాము చేసిన యుద్ధానికి తగినంత సహకారం అందించని మిత్రదేశాలపై ఆయన మండిపడుతూ ఇంధన సంక్షోభాన్ని ట్రంప్ ఒంటిచేత్తోనే నిరోధించారని కొనియాడారు. ఇరాన్‌లోని సిరిక్ నగరంలో వివాహ వేడుకపై అమెరికా జరిపిన దాడి గురించి ప్రశ్నించగా దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఒకవేళ సైన్యం తప్పు చేస్తే గుణపాఠం నేర్చుకుంటుందని వాన్స్ అన్నారు.

సెబీతో అదానీ గ్రూప్ సెటిల్‌మెంట్....



అదానీ గ్రూపునకు చెందిన ఐదు కంపెనీలు తమ వ్యాపార లావాదేవీల వివరాల వెల్లడిలో జరిగిన తప్పులకు సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ'తో వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. సాధారణంగా ఒకే గ్రూప్‌నకు చెందిన రెండు వేర్వేరు కంపెనీలు తమలో తాము జరిపే ఆర్థిక లావాదేవీల (రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్) వివరాలను పెట్టుబడిదారులకు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది.

అదానీ గ్రూప్ 2012-13 నాటి కొన్ని లావాదేవీల సమాచారాన్ని సరిగ్గా వెల్లడించలేదని, అలాగే ఆడిట్ నివేదికలపై సంతకాలు చేసిన సిఏ సంస్థల అనుమతుల్లో లోపాలు ఉన్నాయని సెబీ నోటీసులు ఇచ్చింది. ఈ పాత కేసుల విచారణను పూర్తిగా ముగించేందుకు అదానీ గ్రూప్ కంపెనీలు మొత్తం రూ. 1.51 కోట్ల రూపాయలను సెటిల్‌మెంట్ ఫీజుగా చెల్లించాయి. ఈ ఒప్పందంలో భాగంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 76.05 లక్షలు, అదానీ గ్రీన్ ఎనర్జీ రూ. 45.50 లక్షలు చెల్లించగా.. మిగిలిన మూడు కంపెనీలు దాదాపు రూ. 10 లక్షల చొప్పున చెల్లించాయి. కంపెనీలు ఈ నిధులను జమ చేయడంతో అదానీ గ్రూప్‌పై ఉన్న విచారణ ప్రక్రియను ముగిస్తున్నట్లు సెబీ ప్రకటించింది. గతంలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణల విషయంలో కూడా సెబీ ఇప్పటికే అదానీ గ్రూప్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ సెటిల్‌మెంట్ ఫీజు చెల్లింపుతో అదానీ కంపెనీలపై ఉన్న అన్ని పాత వివాదాలు పూర్తిగా తొలగిపోయినట్లయింది.

పెట్రో బాంబ్! నిత్యావసర ధరలు పెరుగుతాయా?



ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు.. ఏకంగా 10రోజులుగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల పైనే కొనసాగుతోంది. అంటే ప్రపంచానికి ఇంధన ఖర్చుల విషయంలో మరోసారి గట్టి హెచ్చరిక మొదలైనట్టే. మరి ప్రపంచంలోనే అత్యధికంగా చమురును దిగుమతి చేసుకునే దేశాల్లో ఒకటైన భారత్‌పై దీని ప్రభావం ఎంత ఉంటుంది? పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా? విమాన టికెట్ల ధరలు పెరుగుతాయా? మనం కొనుక్కునే కూరగాయలు, నిత్యావసరాలపై కూడా ఈ ప్రభావం పడుతుందా? అసలు క్రూడ్ ఆయిల్ 100 డాలర్ల దగ్గర ఎక్కువకాలం ఉంటే మన ఇంటి బడ్జెట్ పరిస్థితి ఏంటి? ఇక్కడ ముందుగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. భారత్‌కు అవసరమైన ముడి చమురులో 85 శాతానికి పైగా ఇతర దేశాల నుంచే వస్తుంది. అంటే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ధర పెరిగితే భారత్ ఎక్కువ డాలర్లు చెల్లించి అదే చమురును కొనాలి. ఈసారి ధరల పెరుగుదలకు ప్రధాన కారణం డిమాండ్ ఒక్కసారిగా పెరగడం కాదు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి చుట్టూ ఏర్పడిన సరఫరా ఆందోళనలు ప్రపంచ చమురు మార్కెట్‌పై ఒత్తిడి పెంచుతున్నాయి. అయితే క్రూడ్ 100 డాలర్లు దాటిందంటే మరుసటి రోజే పెట్రోల్ బంక్‌లో ధర పెరిగిపోతుందని అర్థం కాదు. భారత్‌లో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు కొంతకాలం అంతర్జాతీయ ధరల మార్పులను తమ మార్జిన్లలో సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే క్రూడ్ ధరల్లో ఇంతటి కదలిక వచ్చినా దేశీయ పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే అదే స్థాయిలో మారాల్సిన పరిస్థితి ఉండదు. కానీ అసలు సమస్య ధర ఎక్కువకాలం ఇలాగే కొనసాగితే మొదలవుతుంది. భారత్ ఎక్కువ డాలర్లు చెల్లించి చమురు దిగుమతి చేసుకోవాల్సి వస్తే దేశం నుంచి విదేశాలకు వెళ్లే డబ్బు పెరుగుతుంది. దీనివల్ల రూపాయిపై ఒత్తిడి రావచ్చు. రూపాయి బలహీనపడితే చమురును దిగుమతి చేసుకోవడం మరింత ఖరీదవుతుంది. ఇలా ఒక ప్రభావం మరో ప్రభావాన్ని పెంచే పరిస్థితి ఏర్పడుతుంది. ఆ తర్వాత దీని ప్రభావం రవాణా ఖర్చులపై కనిపిస్తుంది. డీజిల్ ధర పెరిగితే ట్రక్కులు, బస్సులు, ఇతర వాహనాల నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. సరుకులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలించడానికి ఎక్కువ ఖర్చవుతుంది. ఆ ఖర్చు చివరికి వస్తువుల ధరల్లోకి చేరుతుంది. మనం మార్కెట్‌లో కొనుక్కునే కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసరాల ధరలపై కూడా పరోక్షంగా ఒత్తిడి పెరగవచ్చు. విమాన ప్రయాణికులపైనా ప్రభావం ఉండొచ్చు. విమానయాన సంస్థలకు ఇంధనమే అతిపెద్ద నిర్వహణ ఖర్చుల్లో ఒకటి. విమాన ఇంధనం ధర ఎక్కువకాలం పెరిగితే ఆ భారంలో కొంత భాగం టికెట్ ధరల ద్వారా ప్రయాణికులపై పడే అవకాశం ఉంటుంది. ఇదంతా కలిపి చూస్తే క్రూడ్ ఆయిల్ కథ పెట్రోల్ బంక్ దగ్గర మొదలై అక్కడే ముగిసేది కాదని అర్థమవుతుంది. అది రూపాయి విలువను తాకొచ్చు, దిగుమతి బిల్లును పెంచొచ్చు, రవాణా ఖర్చులను పెంచొచ్చు, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి తీసుకురావచ్చు. అయితే ప్రస్తుతం అత్యంత కీలకమైన ప్రశ్న ఒక్కటే. 100 డాలర్లను దాటిందా లేదా అనేది కాదు. ఈ ధరలు ఇంకా ఎన్ని రోజులు 100 డాలర్ల పైనే కొనసాగుతాయన్నదే భారత్‌కు అసలు పరీక్ష.


'ఆరోహన్' బాటలో వేదాంత పవర్....



వికసిత్ భారత్ సాధన దిశగా దేశం ముందంజ వేస్తున్న తరుణంలో, భారత విద్యుత్ రంగంలో తదుపరి తరం నాయకులను తీర్చిదిద్దేందుకు వేదాంత పవర్ యువ ప్రతిభను విశేషంగా ప్రోత్సహిస్తోంది. ప్రస్తుత సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 56% మంది 35 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం.

ఇందులో భాగంగా ఇటీవల ప్రముఖ విద్యాసంస్థల నుంచి నిర్వహించిన క్యాంపస్ నియామకాల ద్వారా 54 మంది నూతన నిపుణులను సంస్థలోకి తీసుకున్నారు. వీరిలో 57% మంది మహిళా నిపుణులు ఉండటం విశేషం. ఇంజనీరింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్, ఈఎస్జీ (ఇఊ), సీఎస్ఆర్ వంటి విభిన్న విభాగాల్లో చేరిన ఈ యువ రక్తం, సంస్థకు కొత్త దృక్పథాన్ని మరియు నైపుణ్యాలను తెస్తుందని వేదాంత పవర్ విశ్వసిస్తోంది. ఈ సందర్భంగా నూతన ఉద్యోగుల కోసం 'ఆరోహన్ ? ది రైజ్ ఆఫ్ పవర్' పేరుతో నాలుగు రోజుల పాటు సమగ్ర ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాంట్ ప్రత్యక్ష సందర్శనలు మరియు సీనియర్ నాయకత్వంతో సంభాషణల ద్వారా వ్యాపార కార్యకలాపాలపై వీరికి విస్తృత అవగాహన కల్పించారు. సాంకేతిక పురోగతి, విద్యుత్ వ్యవస్థల సంక్లిష్టత పెరుగుతున్న ప్రస్తుత కాలంలో నిపుణులైన నాయకుల అవసరం ఎంతైనా ఉందని వేదాంత పవర్ సీఈఓ రాజిందర్ సింగ్ అహుజా స్పష్టం చేశారు. కేవలం విద్యుత్ ఉత్పత్తిని పెంచడమే కాకుండా, సంక్లిష్ట ఆస్తులను నిర్వహించగల, కొత్త సాంకేతికతలను స్వీకరించగల సమర్థవంతమైన నాయకత్వాన్ని తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యువ ఉద్యోగులకు కెరీర్ ప్రారంభంలోనే యాజమాన్య బాధ్యతలు, నాయకత్వ మార్గదర్శకత్వం అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నట్లు తెలిపారు. క్రమబద్ధమైన అభ్యాసం మరియు కార్యాచరణ అనుభవాల ద్వారా భవిష్యత్ ఇంధన సవాళ్లను ఎదుర్కొనేలా సిబ్బందిని సన్నద్ధం చేస్తూ, వేదాంత పవర్ భారతదేశపు విద్యుత్ రంగ వృద్ధి ప్రస్థానంలో కీలక పాత్ర పోషిస్తోంది.

పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన పథకాల వడ్డీ రేట్లలో మార్పులు..?



చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పెట్టుబడిదారులకు వ తేదీ ముఖ్యమైనది. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్ర వంటి పథకాలపై అక్టోబర్-డిసెంబర్ 2026 త్రైమాసికానికి సంబంధించి వడ్డీ రేట్లను ప్రభుత్వం న సమీక్షించనుంది. గత జూన్ 30న జరిగిన త్రైమాసిక సమీక్షలో వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇప్పుడు మరోసారి రేట్లు మారుతాయా లేదా ప్రస్తుత స్థాయిలోనే కొనసాగుతాయా అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ పథకాల వడ్డీ రేట్లను నిర్ణయించడంలో ప్రభుత్వ బాండ్ల రాబడి కీలక పాత్ర పోషిస్తుంది. జూన్ చివరి నుంచి లాంగ్ టర్మ్ ప్రభుత్వ బాండ్ల ఈల్డ్ లో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఉదాహరణకు జూన్ 30 నాటికి సుమారు 6.74 శాతం ఉన్న 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ ఈల్డ్, సెప్టెంబర్ 22 నాటికి దాదాపు 7.05 శాతానికి పెరిగింది. అంటే ఈ కాలంలో సుమారు 31 బేసిస్ పాయింట్ల వృద్ధి కనిపించింది. బాండ్ ఈల్డ్ పెరిగినంత మాత్రాన ప్రభుత్వం అదే నిష్పత్తిలో చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లను పెంచుతుందని చెప్పలేము. దీనిపై తుది నిర్ణయం పూర్తిగా ప్రభుత్వానిదే. పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు దీర్ఘకాలిక పెట్టుబడులకు ఎంతో ప్రాచుర్యం పొందాయి. వీటిలో వచ్చే చిన్న మార్పులు కూడా భవిష్యత్తులో అందే మొత్తం రిటర్న్‌పై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. అలాగే కిసాన్ వికాస్ పత్రలో వడ్డీ రేటుతో పాటు మెచ్యూరిటీ కాల వ్యవధి కూడా ఇన్వెస్టర్లకు చాలా కీలకం. ప్రభుత్వ అధికారిక ప్రకటన వెలువడే వరకు వడ్డీ రేట్ల పెంపుపై స్పష్టత రాదు. న వెలువడే ఈ కొత్త వడ్డీ రేట్లు అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు తదుపరి మూడు నెలల కాలానికి అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం పీపీఎఫ్ వడ్డీ రేటు 7.1 శాతం ఉండగా.. సుకన్య సమృద్ధి యోజన పథకం వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంది.

బొగ్గు గ్యాసిఫికేషన్ రేసులో అదానీ, ఎన్‌టీపీసీ...



బొగ్గు, లిగ్నైట్‌ను గ్యాస్‌గా మార్చే ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రకటించిన రూ. 37,500 కోట్ల విలువైన గ్యాసిఫికేషన్ పథకానికి తొలి విడతలోనే మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం విదేశాల నుంచి ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఏటా దాదాపు రూ. 2.77 లక్షల కోట్లు ఖర్చవుతోంది. ఈ పథకం ద్వారా మొత్తం 25 ప్రాజెక్టులలో సుమారు రూ. 2.5 నుండి రూ. 3 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, 50,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం అంచనా వేస్తోంది.అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎంటీపీసీ సహా ఐదు కంపెనీలు మొత్తం ఏడు ప్రాజెక్టులకు దరఖాస్తు చేసుకున్నట్లు బొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడు యూరియా ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపగా, తాల్చేర్ ఫెర్టిలైజర్స్ మరో యూరియా ప్రాజెక్టుకు దరఖాస్తు చేసింది.

డీఆర్ఐ (డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్), సింథటిక్ గ్యాస్ ప్రాజెక్టును గ్యాలంట్ ఇస్పాత్, సింథటిక్ నేచురల్ గ్యాస్ ప్రాజెక్టును ఎంటీపీసీ, సింథటిక్ గ్యాస్ ప్రాజెక్టును శ్యామ్ సెల్ అండ్ పవర్ ప్రతిపాదించాయి.

సెప్టెంబర్ 8 నుంచి రెండో విడత దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఇకపై ప్రతి రెండు నెలలకు కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది.

దీంతో ప్రాజెక్టులు సిద్ధమైన కంపెనీలు ఎప్పటికప్పుడు తమ ప్రతిపాదనలు సమర్పించవచ్చు. దేశంలో లభించే బొగ్గును ఉపయోగించి సింగాస్, మిథనాల్, అమ్మోనియా, యూరియా వంటి అధిక విలువైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం విదేశాల నుంచి ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఏటా దాదాపు రూ. 2.77 లక్షల కోట్లు ఖర్చవుతోంది. ఈ పథకం ద్వారా మొత్తం 25 ప్రాజెక్టులలో సుమారు రూ. 2.5 నుండి రూ. 3 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, 50,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించాలని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

వర్షంలో తడిస్తే ఆరోగ్యానికి మంచిదేనా...?



వర్షాకాలంలో చల్లని జల్లులు, ఆహ్లాదకరమైన వాతావరణం చాలా మందిని వర్షంలో తడవడానికి ఆకర్షిస్తాయి. పరిమిత సమయం పాటు వర్షంలో తడవడం వల్ల మానసిక ప్రశాంతత, ఉల్లాసం కలగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వర్షపు చినుకులు ఒత్తిడిని తగ్గించి మనసుకు సేదతీరే అనుభూతిని కలిగిస్తాయి. వర్షాకాలం రాగానే చల్లని గాలులు, మెల్లని జల్లులు ప్రకృతిని మరింత అందంగా మారుస్తాయి. ఈ సమయంలో చాలా మందికి వర్షంలో తడవాలని, స్నేహితులతో కలిసి సరదాగా గడపాలని అనిపిస్తుంది. అయితే జలుబు, జ్వరం వస్తాయనే భయంతో చాలామంది వెనుకడుగు వేస్తారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పరిమిత సమయం పాటు వర్షంలో తడవడం కొంతమందికి మానసిక ఉల్లాసాన్ని కలిగించవచ్చు. అయితే కొన్ని ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వర్షపు చినుకులు, చల్లని వాతావరణం మనసుకు ప్రశాంతతను కలిగిస్తాయి. ప్రకృతితో సన్నిహితంగా గడపడం వల్ల ఒత్తిడి తగ్గినట్లు అనిపించవచ్చు. వర్షంలో కొద్దిసేపు గడపడం మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో సహాయపడుతుంది. వర్షపు నీరు తాకడం వల్ల శరీరానికి చల్లదనం కలుగుతుంది. వేడి వాతావరణం నుంచి ఉపశమనం లభించి తాజాగా ఉన్న భావన కలుగుతుంది. ఎండాకాలంలో చెమట కారణంగా వచ్చే కొన్ని చర్మ అసౌకర్యాల నుంచి చల్లని వర్షపు నీరు తాత్కాలిక ఉపశమనం ఇవ్వవచ్చు.

ఆముదంతో అద్భుత లాభాలు.....



మన పూర్వీకులు వంటింట్లోనూ, సౌందర్య సాధనంగానూ ఆముదానికిఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. కాలక్రమేణా మార్కెట్లోకి వచ్చిన రసాయనఉత్పత్తుల వల్ల దీని వాడకం తగ్గినప్పటికీ, ప్రస్తుత కాలంలో మళ్లీ ఆముదం ప్రాముఖ్యత పెరుగుతోంది. ఆముదంలో ఉండే రిసినోలిక్ యాసిడ్, విటమిన్ ఇ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు శారీరక ఆరోగ్యానికే కాకుండా,చర్మ, జుట్టు సంరక్షణకు అద్భుతంగా పనిచేస్తాయి. ఒత్తైన,పొడవైన జుట్టు కోసం: జుట్టు రాలడం, చుండ్రు మరియు జుట్టు పలచబడటం వంటి సమస్యలకు ఆముదం అద్భుతమైన పరిష్కారం. ఇది తలలో రక్తప్రసరణను మెరుగుపరిచి వెంట్రుకల కుదుళ్లను బలంగా మారుస్తుంది. కొబ్బరి నూనె లేదా బాదం నూనెతో కొద్దిగా ఆముదాన్ని కలిపి వారానికి రెండుసార్లు తలకు పట్టిస్తే జుట్టు ఒత్తుగా, నల్లగా పెరుగుతుంది.సహజసిద్ధమైన మాయిశ్చరైజర్: పొడి చర్మం ఉన్నవారికి ఆముదం ఒక వరం లాంటిది. ఇది చర్మంలోని తేమను బయటకు పోకుండా లాక్ చేస్తుంది. రాత్రి పడుకునే ముందు కొన్ని చుక్కల ఆముదాన్ని ముఖానికి, చేతులకు రాసుకుంటే చర్మం కోమలంగా, కాంతివంతంగా మారుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం: ఆముదానికి సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలు ఉన్నాయి.

వర్షాకాలంలో పుదీనా తింటే ఇన్ని కష్టాలా..?




వేసవి కాలంలో పుదీనా చట్నీ, జల్జీరా, రైతా, లేదా పుదీనా షర్బత్ లేని ఇల్లు ఉండదు. ప్రజలు దాని చల్లదనాన్ని, సువాసనను రెండింటినీ ఇష్టపడతారు. కానీ, వర్షాకాలం ప్రారంభం కాగానే, చాలా ఇళ్లలో ఒకే మాట పదేపదే వినిపిస్తుంది. ఇప్పుడు పుదీనా తక్కువగా తినాలని... చాలా మంది ఇది కేవలం అపోహ అని అనుకుంటారు. కానీ, ఆయుర్వేదంలో దీనికి దాని స్వంత కారణాలు ఉన్నాయి. శరీరం అన్ని కాలాల్లోనూ ఒకే విధంగా ప్రవర్తించదు. వేసవిలో పనిచేసేది వర్షాకాలంలో అదే విధంగా పనిచేయకపోవచ్చు. అందుకే కాలాలు మారేకొద్దీ మీ ఆహారాన్ని మార్చుకోవాలని ఆయుర్వేదం సిఫార్సు చేస్తుంది. ఈ నేపథ్యంలోనే కానీ వర్షాకాలంలో పుదీనాను తీసుకోకపోవడమే మంచిదని ఆయుర్వేద నియమాలు చెబుతున్నాయి. పుదీనా అనగానే మనకు దాని అద్భుతమైన సువాసన, చలువ చేసే గుణం గుర్తుకొస్తాయి. ఎండాకాలంలో బాడీని కూల్ చేయడానికి పుదీనా చట్నీ, పుదీనా జ్యూస్ లేదా మోహిటోలను ఎక్కువగా తీసుకుంటాం. అయితే, వేసవిలో అమృతంలా పనిచేసే ఈ పుదీనా, వర్షాకాలం వచ్చేసరికి ఆరోగ్యానికి హాని కలిగించే అవకాశం ఉందని ఆయుర్వేద శాస్త్రం, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో పుదీనా తినడం వల్ల కలిగే నష్టాలు, పాటించాల్సిన ఆయుర్వేద నియమాలు ఏంటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. బ్యాక్టీరియా, కీటకాల ముప్పు: వర్షాకాలంలో వాతావరణంలో తేమ శాతం చాలా ఎక్కువగా ఉంటుంది.

పాలకూర ఆకుల వెనుక డేంజర్ సీక్రెట్...



ప్రకృతి మనకు ప్రసాదించిన అత్యంత పోషకవిలువలున్న ఆకుకూరలలో పాలకూర అగ్రస్థానంలో ఉంటుంది. పరిమాణంలో చిన్నదైనప్పటికీ, ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అపారమైనవి. అందుకే వైద్యులు సైతం రోజువారీ ఆహారంలో పాలకూరను చేర్చుకోవాలని సూచిస్తుంటారు. మన శరీరానికి అవసరమైన ఐరన్, పీచుపదార్థం, విటమిన్ ఎ, సి వంటి కీలక పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. దీనివల్ల ప్రజలు నిత్యం పప్పు, కర్రీస్, పరాటాలు, సూప్‌లు, సలాడ్‌లు, జ్యూస్‌ల రూపంలో పాలకూరను విరివిగా ఉపయోగిస్తుంటారు. పోషకాల గని అయిన పాలకూరను వంటల్లో ఉపయోగించే ముందు సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే మాత్రం ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పాలకూర ఆకులపై మట్టి, దుమ్ముతో పాటు కంటికి కనిపించని చిన్న చిన్న పురుగులు, బ్యాక్టీరియా చేరే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరిగ్గా కడగని ఆకుకూరలను తినడం వల్ల అనేక రకాల ఇన్ఫెక్షన్లు, కడుపు సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే వీటిని వండడానికి లేదా తినడానికి ముందు శుభ్రమైన పద్ధతుల్లో కడగడం చాలా ముఖ్యం. పాలకూరను క్లీన్ చేయడానికి ఒక సులభమైన మార్గం ఉంది. ముందుగా ఒక పెద్ద గిన్నెలో చల్లటి నీటిని నింపుకుని, అందులో పాలకూర ఆకులను వేసి మెల్లగా కదిలించాలి. ఇలా చేయడం వల్ల ఆకులపై పేరుకుపోయిన మట్టి లూజ్ అయి కిందకు రాలిపోతుంది. ఆ తర్వాత ప్రతి ఆకును విడివిడిగా పారుతున్న నీటి కింద ఉంచి కడగాలి. దీనివల్ల ఆకులకు పట్టుకుని ఉన్న మిగిలిన దుమ్ము, సూక్ష్మక్రిములు పూర్తిగా తొలగిపోతాయి. కేవలం కడగడమే కాకుండా కడిగిన తర్వాత పాటించాల్సిన జాగ్రత్తలు కూడా అంతే ముఖ్యం. నీటి నుండి తీసిన పాలకూర ఆకులను ఒక శుభ్రమైన గుడ్డతో లేదా పేపర్ టవల్‌తో మెల్లగా తడి ఆరేలా తుడవాలి. గట్టిగా ఒత్తిడి పెడితే ఆకులు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కొన్ని ఆకులు వంగి లేదా ముడుచుకుని ఉంటాయి. అటువంటి ఆకుల మడతలలో మురికి, చిన్న కీటకాలు చిక్కుకుపోయే అవకాశం ఎక్కువ కాబట్టి కడిగేటప్పుడు ప్రతి మూలనూ నిశితంగా పరిశీలించి శుభ్రం చేయాలి. పాలకూరను నిల్వ చేసే విషయంలో చాలామంది చేసే పొరపాటు.. మార్కెట్ నుండి తెచ్చిన వెంటనే కడిగి ఫ్రిజ్‌లో పెట్టడం. కానీ అలా చేయడం వల్ల అధిక తేమ కారణంగా ఆకులు త్వరగా కుళ్లిపోయి పాడవుతాయి. కాబట్టి పాలకూరను వండే ముందు మాత్రమే కడగడం ఉత్తమం.

ప్రతిభని నిరూపించుకుంటూ ఎదగడమే నిజమైన విజయం



టాలీవుడ్‌లో వరుస పరాజయాలతో కాస్త వెనుకబడిన యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్, తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టేందుకు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. గడిచిన నాలుగైదేళ్లలో పవన్ కళ్యాణ్ సరసన భారీ బడ్జెట్ చిత్రం 'హరిహర వీరమల్లు', పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'రాజాసాబ్' వంటి అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయాయి.

స్టార్ హీరోల సరసన పెద్ద సినిమాలు చేసినా సక్సెస్ రాకపోవడంతో ఆమె కెరీర్ ఊపందుకోలేదు. అయినప్పటికీ ఏ మాత్రం కుంగిపోకుండా, రూట్ మార్చి ఇప్పుడు ఓ వైవిధ్యమైన లేడీ ఓరియంటెడ్ సినిమాతో ఆడియన్స్‌ను పలకరించేందుకు రెడీ అవుతోంది.

ఈనేపథ్యంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి తన మనసులోని మాటలను బయటపెట్టారు. ప్రతిభను నిరూపించు కుంటూ ఉన్నత స్థాయికి ఎదగడమే నిజమైన విజయమని తేల్చిచెప్పిం ది. సౌత్ ఇండస్ట్రీలో తనకు సరైన గుర్తింపునిచ్చే పవర్‌ఫుల్ రోల్స్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నానని, తాను చేరుకోవాల్సిన లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తన నటనను మరింత మెరుగుపరుచుకోవడానికి ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేస్తున్నట్లు నిధి తెలిపింది.

పెళ్లి చేసుకోకుండానే తల్లిని అవుతా..!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్, మల్టీ టాలెంటెడ్ బ్యూటీ శృతి హాసన్ పెళ్లిపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్న శృతి..వయసు నలభైకి చేరువవుతున్నా పెళ్లి చేసుకోకుండా సింగిల్‌గా ఉండటంపై మాట్లాడుతూ.. తాను వివాహ వ్యవస్థకు వ్యతిరేకం కాదని స్పష్టం చేసింది. తనకు తోడుగా ఉండే భాగస్వామి కావాలని కోరుకుంటానని చెప్పింది. అయితే ఎప్పుడూ ఒకే బాక్స్‌లో ఇమిడిపోయే మనిషిని కానని, తన జీవితాన్ని తన ఇష్టప్రకారమే జీవిస్తానని తెలిపింది. కొన్ని విషయాల్లో తాను సంప్రదాయబద్ధంగా ఉంటానని, మరికొన్నింటిలో పాత పద్ధతులకే కట్టుబడి ఉంటానని వెల్లడించింది. అయితే ఏదీ తనపై ఎవరూ బలవంతం చేయకపోవడం వల్లే ఆ పద్ధతులు పాటిస్తున్నానని క్లారిటీ ఇచ్చింది. పెళ్లిళ్లలో జరిగే ఆర్భాటాలపై సెన్సేషనల్ కామెంట్స్ చేస్తూ.. పెళ్లి పత్రాలు, కోట్ల రూపాయల ఖర్చులు, షోఆఫ్ చూస్తే "ఇదంతా అసలు ఎవరికోసం చేస్తున్నాం?" అనిపిస్తుందని మనసులో మాట బయటపెట్టింది. లీగల్ పేపర్ల బంధం కంటే, ప్రతిరోజూ ఇద్దరం ఒకరినొకరం మనస్ఫూర్తిగా ఎంచుకోవడమే నిజమైన ప్రేమ అని తాను నమ్ముతానని చెప్పింది.

అమ్మవారిగా అదా శర్మ ఉగ్రరూపం



'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అందాల భామ అదా శర్మ, తన కెరీర్‌లో సరికొత్త మార్పులు చేసుకుంటోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యం ఉన్న చాలెంజింగ్ రోల్స్‌ను ఎంచుకుంటూ దూసుకెళ్తోంది. తెలుగు, తమిళ, హిందీ, మరాఠీ భాషల్లో వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న ఈ బ్యూటీ, తాజాగా కన్నడ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చింది. సరిగ్గా పదకొండేళ్ల క్రితం పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్ హీరోగా నటించిన 'రణవిక్రమ్' సినిమాతో సాండల్‌వుడ్‌లోకి అడుగుపెట్టిన అదా శర్మ.. ఆ తర్వాత అక్కడ వచ్చిన ఆఫర్లను సున్నితంగా తిరస్కరించింది. ఇన్నేళ్లు లాంగ్ గ్యాప్ తీసుకున్న ఆమె, ఇప్పుడు ఏకంగా ఒక పవర్‌ఫుల్ మైథాలజీ మూవీతో కన్నడ ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 'రామరస' టైటిల్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అదా శర్మ అమ్మవారి రూపంలో కనిపించి షాక్ ఇచ్చింది. ముఖంలో తీవ్రమైన ఆగ్రహం ఉట్టిపడుతుండగా, చేతిలో త్రిశూలం ఎక్కుపెట్టి ఎంతో ఉగ్రరూపంలో ఆమె కనిపిస్తున్న తీరు సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఆమె పక్కనే కొందరు నాలుకలు బయటకు పెట్టి ఉన్న భయానక వాతావరణం ఈ పోస్టర్‌ను మరింత ఇంటెన్సివ్‌గా మార్చింది.

నాపై అలాంటి విమర్శలు చేయడం మూర్ఖత్వమే



మెగాస్టార్ చిరంజీవిపై గత కొంతకాలంగా కొందరు పనిగట్టుకుని నెగెటివిటీని స్ప్రెడ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఎంతో నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌పై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ, అక్కడి రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్‌లో పాల్గొన్న చిరంజీవి.. ఈ ఆరోపణలపై స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో ఎన్నో అవమానాలు, విమర్శలు ఎదుర్కొన్నానని చెప్పిన మెగాస్టార్.. బ్లడ్ బ్యాంక్‌పై వస్తున్న విమర్శలు పూర్తిగా అర్థరహితమని కొట్టిపారేశారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com